ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
15 మే, 2011

ENTERED

ఒక ఒసామా వంద ప్రశ్నలు

హ్యాపీబర్త్‌డే

(2011 మే 15నుంచి 2011 మే 21 వరకు)

టి. మనీషా
4సం॥, మే-2007
జనార్ధన్-భాగ్యమ్మ
జీడికల్-వరంగల్ జిల్లా.

డి. మనోజ్ కుమార్
3సం॥, మే-2008
నాగజ్యోతి-రాఘవులు
రాజ్యంపేట-కడప

బి. మోక్షిత(డింపుల్)
4సం॥, మే-18
లావణ్య-దామోదర్
అస్మత్‌పూర్-రంగారెడ్డి

కె. భార్గవి
2సం॥, మే-2009
రాజ్యలక్ష్మి-చంద్రశేఖర్
రేవేంద్రపాడు-గుంటూరు

జె.భవ్య
5సం॥, మే-17
దుర్గ-శ్రీధర్
శాంతినగర్-విశాఖ

వై.ఎన్. వరుణ్
5సం॥, మే-2006
రాధిక-అనిల్‌కుమార్
మేడ్చల్

హర్షిత్
1సం॥, మే-2010
లావణ్య-సందీప్
కోరుట్ల-కరీంనగర్

ఎం.వర్షిణిశ్రీ
1సం॥, మే-15
పావని-నాగబాబు
విశాఖపట్నం

సంజయ్ హర్షకుమార్
మే-18
ధనలక్ష్మి-కృష్ణ
రావినూతల-ఖమ్మం

సి.శ్రీనిత
2సం॥,మే-2009
గాయత్రి-రమణ
అనంతపురం

పి.లీల వెంకటశ్రీకృష్ణ
1సం॥,మే-2010
రమాదేవి-రామకృష్ణ
కొప్పాక-ప॥గో

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే మీ బాబు- పాప పేరు, పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు, తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కలర్ ఫొటో జత చేయడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1,
ఎం.హెచ్ భవన్
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email-
venkateshcartoon@gmail.com

ENTERED

మనలో మాట

రోగి రోదన



నా గురించి నేను! ఏమని చెప్పాలి? ఎక్కడి నుంచి మొదలెట్టాలి? అసలు ఎందుకు చెప్పాలి? ఈ తెలుగుదేశంలో నాలాంటి వారు ఎందరో! ఇందు కలరందు లేరని సందేహంబు వలదు. ఎందెందు వెదకినా అందందు కనిపిస్తారు. తమాషా ఏమంటే వారంతా నాలోనూ కనిపిస్తారు. వారి కష్టాలు, కన్నీళ్లు, బాధలు, బరువులు అన్నీ నాలో వున్నాయి. అందుకే మొదలెడుతున్నా. నన్ను ఎక్కువగా అసలు పేరు కన్నా కొసరు పేరుతోనే పిలుస్తారు. నేను ఎంత బాధలో ఉన్నా, ముక్కుతున్నా, మూలుగుతున్నా, తిండి సహించకపోయినా, లేచి నిలబడే ఓపిక వున్నా లేకున్నా ఒక చోటికి మాత్రం చప్పున బయలుదేరతాను. ఆ చోటు ఆసుపత్రి. అక్కడ డాక్టర్లు, నర్సులు, సిబ్బంది నన్ను పిల్చే కొసరు పేరు రోగి. నాకప్పుడప్పుడు అనిపిస్తుంటుంది! వేమన ఇప్పుడున్నట్టయితే రోగుల్లో నాలాంటి పేద రోగులు వేరయా అని చెప్పి వుండేవాడని! చిన్న రోగమొచ్చినా పెద్ద జబ్బు చేసినా ఏలికలు తమవి కాదనుకొంటున్న సర్కారు దవాఖానాలే దిక్కు. వెలసిన గోడలు, అరకొర వైద్యులు-సిబ్బంది, అపరిశుభ్ర పరిసరాలు, చెట్ల కిందే పడిగాపులు కాసే నాలాంటి వారు, వారికి తోడుగా వచ్చిన అయినవాళ్లు, చెట్ల కొమ్మల సాయంతోనే సెలైన్ ఎక్కించుకునేవారు...అతి సామాన్యంగా కనిపిస్తారు. ఇదంతా ఆసుపత్రి బయట. లోపలి సంగతో! రోగులకు సరిపడా వైద్యులుండరు. ఒకవేళ వున్నా పరీక్షించడానికి పరికరాలుండవు. మందులు అంతకన్నా వుండవు. పరీక్షలు బయట చేయించుకోవాల్సిందే. మందులు బయట కొనుక్కోవాల్సిందే. చేతిలో పైసలు లేకపోతే! అంతేసంగతులు! చిత్తగించవలెను!! ఒక్కో మంచంమీద ఇద్దరేసి రోగులు చొప్పున విశ్రమించాల్సిందే. అది ప్రసూతి వార్డయినా. జనరల్ వార్డయినా. పిల్లల వార్డయినా. వైద్యులు వుండీ లేక...పట్టించుకునీ పట్టించుకోక ఆసుపత్రి బయటే పురుడు పోసుకున్న తెలుగు తల్లులకూ కొదవు లేదు. కుక్క కరిస్తే చేయడానికి యాంటీ ర్యాబిస్ ఇంజక్షన్లూ కరవే. ప్రయివేటు ఆసుపత్రుల్లో సూది వేయించుకునే స్థోమతు లేక కళ్లముందే కన్నబిడ్డ ర్యాబిస్ బారిన పడి ప్రాణాలొదులుతున్నా చూస్తుండే తల్లులకూ లోటు లేదు.

'సీత బాధలు సీతవి. పీత బాధలు పీతవి' అన్నట్టు మా బాధలు ఇవైతే... మాకు వైద్యం చేసే సిబ్బంది బాధలు వేరే. ఖాళీలున్న చోట కొత్త వైద్యులను, సిబ్బందిని భర్తీ చేయరు. ఒక వేళ చేసినా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ తీసుకుంటారు. అదీ వారికి సక్రమంగా జీతాలుండవు. పని భారం సరేసరి. ఇవన్నీ వారి ఈతి బాధలు. వీటిని పక్కన బెట్టి రోగి నాడి చూచినా రోగ నిర్ధారణకు పరికరాలు లేకుండా, మందులు లేకుండా చికిత్స చేయడం ఎలా? ఏలికలకు రోగులంటే ఏమాత్రం కనికరం లేదనడానికి నిదర్శనాలే అవన్నీ. ఎందుకంటే రోగమొచ్చినా...రొష్టొచ్చినా చచ్చినట్టు ఓట్లేస్తాం. ఎలాంటి డిమాండ్లూ చేయం. పరిష్కారం కోసం ధర్నాలు, పోరాటాలు చేయం. అన్నిటినీ మించి సంఘాలు అసలే పెట్టం. ఈ రాష్ట్రంలో ఎన్నో సంఘాలున్నాయి కానీ రోగుల సంఘం లేదు చూశారా! అదే వారి ధైర్యం! అందుకే ఈ నిర్లక్ష్యం. పైకి మాత్రం అద్భుత ప్రచారాలు చేసుకుంటారు. మీ కోసమే సంక్షేమ పథకాలన్నారు. అంతా ఉత్తిదే! కార్పొరేట్ బాబులూ! మీరు కా...స్త బలహీనంగా వున్నారు. అందుకే ఆరోగ్యశ్రీ, 108, 104 హెల్త్ డ్రింకులిస్తాం. తాగి మరింత శక్తిని పుంజుకోండి అన్నారు. వైద్య కళాశాలల్లో, ఆసుపత్రుల్లో వారిదే సింహభాగం. ఈ పేర ప్రజల సొమ్మంతా కార్పొరేట్ బాబులకు బట్వాడా చేసేస్తున్నారు.

రోగికి సరైన మందు వేస్తే...చికిత్స చేస్తే జబ్బు నయమౌతుంది. ఆస్పత్రులయినా అంతే! అయితే సర్కార్ ఆస్పత్రులను చంపేసి పాతిపెట్టాలనుకొనే సర్కారు వారు మందెలా వేస్తారు? మాతోపాటు ఆస్పత్రినీ చంపేస్తారు. అప్పుడు కూడా బలయ్యేది నాలాంటి పేదరోగులే!

★

ఈ సంచికలో....

టపా	...	2
వికాసం	...	4
ఈ పేజ్	...	5
కవిత్వమ్	...	6
నవ్వుల్ పువ్వుల్	...	7
సినిమా కబుర్లు	...	8
కొత్త పుస్తకాలు	...	10
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...



రుచి ... 11

మ్యాంగో కుల్ఫీ

కథ ... 18

నోటు ఆత్మకథ

తెలుసుకుందామా ... 20

వినోదం... విజ్ఞానం



ఎన్నో విషయాలు...

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ చాలా బాగా ముస్తాబవుతోంది. విజ్ఞానదాయకమైన ఎన్నో విషయాలు అందిస్తున్న తీరు బాగుంది. 'తెల్సా'లో మాకు తెలియని ఎన్నో విషయాలు తెలియజేస్తున్నారు. కవితలు బాగున్నాయి. కథలు, బాలనేస్తాలు చదివేలా ఉంటున్నందుకు అభినందనలు.

కోవూరి నర్సింలు,
మాధ్వార్, మెదక్.

ప్రతి వారం అందించరూ...!

'పాపికొండల్లో ప్రయాణం' ప్రకృతి రమణీయ వర్ణన ఎంతో బాగుంది. పోలవరం ప్రాజెక్టు కట్టకుండా ఉంటే హాయిగొలిపే ప్రకృతి అందం మన సొంతమై కలకాలం నిలిచి ఉండేది. 'మేడే నాడు ఏం జరిగింది?' కథనం చాలా బాగుంది. అప్పటిలా మేడేలు ఇప్పుడు జరగడం లేదు. పోరాట సందర్భాల్లో మాత్రమే జరుగుతున్నాయి. శ్రామికులు వేతనం విషయంలో ప్రశ్నలు వేస్తే యజమానులు నేటికీ పాత విధానమే అనుసరిస్తున్నారు. శ్రామికుల్లో స్వచ్ఛందంగా పోరాట పటిమ పెరగాలి. ప్రైవేటీకరణ అమలవుతున్న ఈ కాలంలో శ్రామికుల్లో ఐక్యత లోపిస్తోంది. వేతన సాధన కోసం తప్ప విప్లవం మొదలవడం లేదు. 'పాపికొండల్లో ప్రయాణం' బాగుంది. ఇలాగే ప్రకృతి సౌందర్యాన్ని ప్రతివారం అందిస్తే బాగుంటుంది. రుచి పేజీ బాగుంది.

బి. కనకలక్ష్మి, ఆముదాల వలస.

ఆకట్టుకున్న ప్రయాణం

పాపికొండల్లో ప్రయాణం ఆకట్టుకుంది. విహార యాత్రల్లో ఇదొక మనోహర దృశ్యం. లాంచీ ప్రయాణం, కొల్లేరు ప్రాంత పల్లెవాసుల జనజీవితం, ప్రశాంత ప్రదేశాలు చూడడం చాలా హాయిని, ఆనందాన్ని కలిగిస్తుంది.

నూతి నారాయణ రావు,
గడ్డిఅన్నారం.

చైతన్యమూర్తి

ప్రపంచ కార్మికుల పోరాటానికి స్ఫూర్తి సంకేతం మేడే. అంతకంటే ఎక్కువ స్ఫూర్తితో తమ హక్కుల కోసం కార్మికులు, కార్మిక సంఘాలు పోరాడాల్సి ఉంది. మదర్ జోన్స్ వ్యాసం అందరికీ చైతన్యాన్ని కలిగిస్తుంది. 'పాపికొండలల్లో ప్రయాణం' వ్యాసం బాగుంది. ప్రజాశక్తి మిత్రుల విహారం కూడా విజ్ఞాన దాయకమైనదే. ఎన్నో ఆసక్తికర విషయాలను స్నేహ ద్వారా అందిస్తున్నందుకు అభినందనలు.

టి. శ్రీరామ్మూర్తి, గాజువాక.

తాజా పుస్తక సమాచారం

ఈవారం పాఠకులందర్నీ పాపికొండల్లో ప్రయాణం చేయించిన సత్యాజీకి అభినందనలు. 'ఈ పేజీ' అందించిన 2జి, 3జి అంశాలు ఉపయోగకరంగా ఉన్నాయి. 'బాలనేస్తాలు'లో గూడు కట్టే పక్షి విశేషాలు ఆశ్చర్యపరిచాయి. మరగుజ్జుల గురించి ఆలోచించి, వారి బాగుకోసం తాపత్రయపడ్డ 'చెన్‌మిన్' ఉదాత్తత ఎవరూ మర్చిపోలేనిది. 'మేడే నాడు ఏం జరిగింది?' ద్వారా తెలియని ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. 'సినిమా కబుర్లు' ద్వారా పాటల రచయిత గురించి తెలియజేసిన రెంటాల జూనియర్‌కి ధన్యవాదాలు. 'చూద్దామా' ద్వారా చికాగో నగర విశేషాలు తెలుసుకుంటున్నాం. 'వికాసం'లో సర్వేశ్వర శర్మ నీరు ఎక్కువ తాగమని చెప్పిన ఆరోగ్య సూత్రం ముమ్మాటికీ అక్షర సత్యం. 'మాటలకోట' నింపడం ద్వారా పద సంపద పెరుగుతోంది. 'కొత్త పుస్తకాలు' ద్వారా తాజా పుస్తక సమాచారం అందిస్తున్నారు. మనసారా నవ్వుకోడానికి పైసా ఖర్చుకాదని 'మనలోమాట'లో చెప్పకనే చెప్పారు.

నేమాన సుభాష్ చంద్రబోస్,
శ్రీకాకుళం.

కొత్తదనం ముఖ్యం

మల్లీశ్వరి సినిమా తీసే రోజుల్లో కవులకి స్వతంత్రం ఉండేది. 'ఆకాశ వీధిలో హాయిగా ఎగిరేవు...' అనే కృష్ణశాస్త్రి పాట ఎన్నాళ్ల తర్వాతో ఉపయోగించుకున్నారు. అప్పట్లో ఒకసారి పాట రాసి ఇస్తే అందులో మార్పులు జరిపే ప్రశ్నే ఉండేది కాదు. కానీ ఈరోజు పాటలు రాసే వారి దుస్థితి ఎలా ఉందంటే పత్రికకు పంపిన కవితలు నచ్చితేనే వేసుకుంటున్నట్టు సినీ కవులు రాసిన పాటలు కూడా అలాగే తిరస్కారానికి గురవడం ఎక్కువైంది. పాట రాయడం కన్నా రాసింది ఒకే చేయించుకోవడమే కష్టం అన్న భాస్కరభట్ల మాట వాస్తవం. సినిమా పాట సకల జనావళికి అర్థం అవడం, కొత్తగా రాయడం చాలా ముఖ్యం. రామ జోగయ్య శాస్త్రి 'బాగుందే నీ ఒంటి వాస్తు కళ్ళ' అని రాశారు. నువ్వు చాలా అందంగా ఉన్నావు అని చెప్పడాన్ని కొత్త పదాల్లో చెప్పారాయన. ఇలా ఎప్పటికప్పుడు నవీకరించుకోవడం, భాషాజ్ఞానం పెంపొందించుకోవడం అవసరం.

మాధవీ సనారా, అనకాపల్లి.

కర్మాగారాలు

'పాపికొండల్లో ప్రయాణం...'



ముఖచిత్రం బాగుంది. ఈ వ్యాసం సత్యాజీ ప్రకృతి వర్ణనా నిపుణతకు, సూక్ష్మ విషయ పరిశీలనా పటిమకు, అద్భుత కథనరీతికి నిదర్శనం. వ్యాసం చదువుతుంటే గలగల పారే గోదావరిలో నిల్చుని ప్రకృతిని పరికిస్తున్నట్లు ఉంది. ప్రయాణంలో ఎదురైన సన్నివేశాలను, వాటి చారిత్రక, సామాజిక, సమకాలీన నేపథ్యాన్ని అతి రమ్యంగా వర్ణించారు. పాపికొండల సందర్శనా సమాచారాన్ని కూడా పొందిగ్గా అందించిన రచయితకు అభినందనలు. 'మేడేనాడు ఏం జరిగింది?' చదువుతుంటే హృదయం ద్రవిస్తుంది. ఎనిమిది గంటల పనికోసం ఎంతమంది కష్టజీవులు ఆహుతయ్యారో లెక్కా పత్రం లేదు. కార్మిక పోరాటానికి మద్దతిస్తూ పోరాటం చేసి, నాటి ఘోరకృత్యాలకు నిలువెత్తు సాక్ష్యంలా నిలిచిన మదర్‌జోన్స్ మనందరికీ మార్గదర్శకురాలు. 'వికాసం'లో శర్మ అందించిన సమాచారం ఉపయోగకరంగా ఉంది. 'ఈపేజీ'లో 3జి మొబైల్ టెక్నాలజీకి సంబంధించిన సమాచారం కె.ఎక్స్.రాజు చక్కగా వివరించారు. ఎం. కళ్యాణి 'మా బడి' ఒకప్పటి అందరి బడి. నేడు ఏ స్కూల్ చూసినా ఏముంది గర్వకారణం అన్నట్లుగానే ఉంటున్నాయి. ఒకప్పటి విద్యాలయాలు పిల్లల సంపూర్ణాభివృద్ధికి తోడ్పడే శిక్షణా శిబిరాలు. నేడు అవి తల్లిదండ్రులు నిర్దేశించిన లక్ష్యసాధన దిశగా మాత్రమే తర్ఫీదునిచ్చే కర్మాగారాలుగా మారిపోయాయి.

ఖైరి సత్యనారాయణ, కొత్తగూడెం.

SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...

ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు



K.V.R. B.Com.,B.L., (Director)

రోజుకు ఒక గంట చాలు... సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

☞ **ప్రక్కనవున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:**

CHENNAI:

0-97890 99589

హలో: లేదా మీ అడ్రసుకు కోర్స్ మెటీరియల్ పంపమని **SMS** చేయండి

కోర్సు ఫీజు రూ.1,000/-లు. పై టెలిఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం, ఊరి పేరు, పిన్‌కోడ్‌లతో వివరంగా మీ అడ్రసును SMS ద్వారా పంపండి. ఒక వారంలో పోస్ట్‌మేన్ కోర్సు ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1,000/-లు చెల్లించి కోర్సు పొందవచ్చును. మీకు ఏమైనా సందేహాలు ఉంటే పై నెంబరుకు ఫోన్‌చేసి తెలుగులోనే మాట్లాడవచ్చు.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE TM

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

....Pin Code: ☐☐☐☐☐☐

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:**Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:**93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside:Kaveri Restaurant, WyraRoad, **Cell:**94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:**98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:**9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near:Telephone Exchange. **Ph:**228800, **Cell:**9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex,D.I.Road, **Ph:**232502. **Cell:**98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:**93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:**99855 01587. ● **DHONE:**Opp: Raja Theatre, Kothapeta, **Cell:**93904 95239 ,99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:**93473 53709,92900 91456.

ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

పిచ్చాపాటి కబుర్లు

స్నేహితులతో కబుర్లు చెప్పుకోవడం ఎంతో సంతోషంగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఈ సమయాన్ని ఎంతో ఆనందంగా భావిస్తారు. అయితే ఈ పిచ్చాపాటి కబుర్ల స్థాయి దిగజారిపోయి ఇతరుల ప్రతిష్టను దెబ్బతీసేలా ఉండకూడదు. ఆడవాళ్లు మాత్రమే ఈ విధంగా మాట్లాడుకుంటారని అనుకుంటారు. కాని మగవాళ్ళు కూడా ఈ విషయంలో తీసిపోరట!

- సి.వి. సర్వేశ్వరశర్మ

ఫోన్ నెం: 9866843982

sarma.chavali@gmail.com

పిచ్చాపాటి కబుర్లు మనిషి నుండి మనిషికి మాటలు రవాణా అయ్యేటప్పటికి అసలు విషయం మారిపోతూ ఉంటుంది. ఈ మాటల పర్యవసానం ఒకొకప్పుడు ఇతరుల భవిష్యత్తును దెబ్బతీయవచ్చు. పరువును మంటగలిపివేయవచ్చు. కొంత మంది ప్రాణాల మీదకురావచ్చు.

పిచ్చాపాటి కబుర్లలో రూమర్లు అంటే పుకార్లు వేగం పుంజుకుంటాయి. ముఖ్యంగా వ్యక్తులకు సంబంధించినవి, సామాజిక సంఘటనలకు సంబంధించినవి శరవేగంగా వ్యాప్తి చెందుతాయి.

ఈ పిచ్చాపాటి కబుర్లు అన్ని వయసుల వారిలోను ఉంటాయి. ప్రతి స్థాయిలోను ఉంటాయి. పాఠశాలలు, కళాశాలలు ఈ కబుర్లకు వేదికలు. వీటి వల్ల ప్రతికూల వాతావరణంలో మనుషులు కలిసే అవకాశం ఏర్పడుతుంది. ఈ రకమైన కలయిక ప్రమాదకరమైనది. ఇటువంటి కలయికలు జరుగకూడదు. కొత్తగా ఎవరైనా క్లాసులో చేరినా, కొత్తగా టీచరు వచ్చినా వారికి ఆత్మీయ ఆదరణ కన్నా ఈ కబుర్ల శూలాలు చాలా బాధను కల్గించేవిగా ఉంటాయి.

అసలు కారణాలు

సమాజంలో అశ్రద్ధకు గురైనవారు సులువుగా ఇతరుల దృష్టిని ఆకర్షించే ప్రయత్నంలో పిచ్చాపాటి కబుర్లలో పుకార్లను ప్రవేశపెడుతూ ఉంటారు. ఈ పుకారు మాటలు వినేవారిలో తాత్కాలిక శ్రద్ధ ఉంటుంది. క్షణికానందం కలగజేస్తుంది. కాని దాని దుష్ఫలితాలు చాలా తీవ్రంగా, శాశ్వతంగా ఉంటాయి.

అందుకే ఇతరుల గురించి చెడుగా మాట్లాడే వారిని ఎవరూ ప్రోత్సహించకూడదు. ఎవరైనా ఈ రకంగా మాట్లాడుతుంటే చర్చాంశం మార్చివేయండి. అసాధారణ పరిస్థితులలో ఆ సమూహం నుండి బయటకు వెళ్లిపోండి. అటువంటి చర్చల్లో పాల్గొనేందుకు నిరాకరించండి.

ఈ పుకార్ల వల్ల చరిత్రలో యుద్ధాలు జరిగాయి. రాజ్యాలు పోయాయి. తల్లిదండ్రులను, అన్నదమ్ములను చంపిన వారున్నారు. అంత వరకు ఎందుకు! కుదుర్చుకున్న పెళ్ళిళ్లు చెడిపోయిన సందర్భాలున్నాయి.

తమ మాటల్లో వాస్తవం ఎంత ఉందనేది ఆలోచించకుండా చాలామంది మాట్లాడేస్తుంటారు. రెండూ రెండూ కలిసి అయిదు అయ్యాయని పుకార్లు వ్యాప్తి చేస్తారు. ఈ పుకార్లకు కారణం తాము జనంలో ప్రముఖ వ్యక్తులుగా కన్పించాలనే తాపత్రయం.

తమలోని అసమర్థతను ఈ విధంగా బహిర్గతం చేస్తూ ఈ పుకార్లను వ్యాప్తి చేస్తూ ఆనందిస్తుంటారు. అసూయ సాధారణంగా ఇటువంటి పుకార్లకు కారణంగా కన్పిస్తుంది. వయసులో చిన్నవారు, స్థితిలో జూనియర్లు తరచు పెద్ద వారితో, సీనియర్లతో సరిపోల్చుకుంటూ వారివలె తను సమర్థుడు కాడా? అని ప్రశ్నించుకుంటారు. పదిమంది ముందు మాట్లాడేందుకు భయపడేవారు మంచి వక్తను విమర్శిస్తూ ఉంటారు. తమగొప్పదనం చాటుకునే విధంగా ఇతరులను తక్కువ చేసి మాట్లాడుతూ ఉంటారు.

పిచ్చాపాటి మాటల్లో పుకార్లను ఇలా ప్రచారం చేయడానికి కారణం వ్యక్తిగత ద్వేషం. వారి బలహీనతలను అంగీకరించలేక ఇతరులను తక్కువ చేసి ప్రచారం చేస్తూ ఉంటారు. వీరు ఇతరుల వ్యక్తిత్వాలను ఖూనీ చేస్తుంటారు.

అబ్బాయిలతో మాట్లాడేందుకు భయపడే ఆడపిల్లలు వారి భయాన్ని కప్పి పుచ్చుకునేందుకు అందరిలో పేరు తెచ్చుకుంటున్న సహ విద్యార్థినిని విమర్శిస్తూ ఉంటారు. దీని వల్ల తమ భయాలు బయటపెట్టకుండా ఇతరులను తమ భయాలకు బలిచేస్తుంటారు.

సున్నితమైన పరిస్థితి

ఇతరుల పిచ్చాపాటి కబుర్లలో పుకార్లు వంటివి వ్యాప్తిచేసే మాటలుంటే వాటిని వింటూ ఉంటే మిమ్మల్ని మీరు మోసం చేసుకున్నట్లే. చాలా పర్యాయాలు ఈకరంగా అందించే సమాచారం తప్పుడు సమాచారమే. ఒక వేళ అది నిజమయినా అది మనకు సంబంధం లేనిది. ఎవరూ పరిపూర్ణులు కారు. అందువల్ల ఇతరుల తప్పుల గురించి మాట్లాడడం, వినడం కూడదు.

అలాంటివారు మీ గురించి కూడా ఇలా మాట్లాడతారని గుర్తుంచుకోండి. పుకార్లను వ్యాప్తి చేసేవాళ్లను పక్కన పెట్టండి. వాళ్లను పట్టించుకోకండి. వారిని ఖండించడం కూడా మంచిది. ఎందుకంటే తమను సమాజం వెలేస్తుందనే భయం వారిలో మొదలవుతుంది.

ఎవరూ తమ మాటలు వినడం లేదని తెలుసుకున్న ఈ పుకార్ల సృష్టికర్తలు తమ ఎత్తు పారలేదని ఆ పనికి స్వస్తి చెబుతారు. ఇటువంటి అనుభవాలు సమాజంలో మీకు ఎన్నో పాఠాలు నేర్పుతాయి. మనిషి తన వ్యక్తిత్వాన్ని ఇటువంటి అనుభవాల ద్వారా పెంపొందించుకోవచ్చు. మీ నిజమైన స్నేహితులు ఎవరు? ఎవరిని మీరు నమ్మవచ్చు? వంటివి మీకు అవగతం అవుతాయి.

ఇతరులను ఖండించడంలో మీ సాహసాన్ని మీరు అంచనా వేసుకోగల్గుతారు. మానవ జీవితాల గురించి మరికొన్ని కొత్త విషయాలు తెలుసుకోగల్గుతారు.

★

టెక్‌పేజ్



కంటిచూపుతో పనిచేసే లాప్‌టాప్

"కంటి చూపుతో చంపేస్తా.." అంటూ ఓ ప్రముఖ హీరో డైలాగ్ తెలుగు సినిమా ప్రేక్షకులందరికీ సుపరిచితమే. ఈ డైలాగ్ సినిమా వరకు సరదాగా వున్నప్పటికీ నిజజీవితంలో ఇది ఎంతటి సత్యదూరమో అందరికీ తెలుసు. కంటిచూపుతో ఎదుటివారిని అదుపు చేయడం, ఆజ్ఞాపించడం చాలామందికి అనుభవమే. అయితే కంటిచూపుతో ల్యాప్‌టాప్‌లను కూడా పనిచేయించవచ్చని శాస్త్రవేత్తలు నిరూపించారు. దీనినే ఐ ట్రాకింగ్ టెక్నాలజీ అంటారు.

ప్రస్తుతమైతే డెస్క్‌టాప్ లేదా ల్యాప్‌టాప్‌లపై పనిచేయడానికి మనం కీబోర్డు, మౌస్‌ను ఉపయోగిస్తున్నాం. ఇది సర్వసాధారణం కూడా. అయితే టచ్‌స్క్రీన్ విప్లవం మొదలవడంతో ఇలాంటి పరిజ్ఞానంతో కూడిన డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లు కూడా మార్కెట్‌లోకి వచ్చాయి. మన వేలి కొనలతో స్క్రీన్‌ని తాకడం ద్వారా ఇవి పనిచేస్తాయి. ఇప్పుడు కొత్తగా వచ్చిన ల్యాప్‌టాప్‌ను వేళ్లతో ముట్టుకోవాల్సిన అవసరం కూడా లేదు. మన కంటి చూపుతోనే మెనూను సెలెక్ట్ చేయవచ్చు, ఏదైనా ఫోల్డర్‌ను ఓపెన్ చేయవచ్చు. ఓ ఐకాన్‌ను డ్రాగ్‌చేసి ట్రాష్‌లో పడేయవచ్చు. మ్యూజిక్ ప్లే చేయవచ్చు.. ఫోటోలు, వీడియో ఫైళ్లను కూడా ఓపెన్ చేసుకోవచ్చు, వద్దనుకుంటే క్లోజ్ చేయవచ్చు. టోబి అనే కంపెనీ ఈ రకమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసింది. ఈ టెక్నాలజీ కలిగి ఉన్న డెస్క్‌టాప్ లేదా ల్యాప్‌టాప్ వినియోగదారుల కళ్ల కదలికలను పసిగట్టి వారికేం కావాలో అర్థం చేసుకుని కంప్యూటర్‌ను ఆ రకంగా నియంత్రిస్తూ ఉంటుందన్నమాట. యూజర్లు తమ వైపు చూస్తున్నారా లేదా అన్న విషయాన్ని కూడా ఇవి గమనిస్తాయి. ఒకవేళ చూడడం లేదని అర్థమవగానే వాటంతట అవే స్క్రీన్ సేవర్ మోడ్‌లోకి వెళ్లిపోతాయి. మళ్లీ ఎవ్వరైనా యూజర్ తమ వైపు చూడగానే తిరిగి ఆటోమేటిక్‌గా మానిటర్ ఆన్ అయిపోతుంది.

ఇదీ ఉపయోగం..

డెస్క్‌టాప్ లేదా ల్యాప్‌టాప్‌లపై ఏకాగ్రతతో పని చేయాల్సివుంటుంది. తరచూ కీబోర్డు, మౌస్‌లను ఉపయోగించాల్సిన అవసరమూ వుంటుంది. అంటే– మనం కంప్యూటర్ లేదా ల్యాప్‌టాప్‌లపై పనిచేస్తున్న సమయంలో మరో పని చేసుకోలేం. కానీ ఈ 'ఐ ట్రాకింగ్ టెక్నాలజీ'తో కూడిన ల్యాప్‌టాప్‌లు అలా కాదు.. వీటిపై పని చేసుకుంటూనే మనం ఇతర పనులు కూడా చేసుకోవచ్చు.

ఉదాహరణకు మీరు ఆఫీసుకు వెళ్లగానే ఒక ప్రెజెంటేషన్ ఇవ్వాలి. కానీ ఎక్కువ సమయం లేదు. అయినా సరే ల్యాప్‌టాప్‌ను ఓపెన్ చేసి ఒకవైపు ఆఫీసుకు రెడీ అవుతూనే మరోవైపు కళ్ల కదలికల ద్వారా ప్రెజెంటేషన్ తయారు చేసుకోవచ్చు. ల్యాప్‌టాప్‌ను డైనింగ్ టేబుల్‌పై పెట్టుకుని బ్రేక్‌ఫాస్ట్ చేస్తూనే అత్యవసర ఉత్తరాలు టైపు చేసుకోవచ్చు. అయితే ఈ తరహా ల్యాప్‌టాప్‌లు మార్కెట్‌లోకి విడుదల అవడానికి మరో రెండేళ్ల సమయం పడుతుందని శాస్త్రవేత్తలు చెపుతున్నారు.

గూగుల్ 'క్రోమ్'

కంప్యూటర్ రంగంలో పేరెన్నికగన్న గూగుల్ సంస్థ ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ఇంటర్నెట్ బ్రౌజర్ 'క్రోమ్'. ఇది మైక్రోసాఫ్ట్ ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్ కంటే కూడా ఎక్కువ పేరు సంపాదించుకుందని మార్కర్ రీసెర్చ్ సర్వేలో వెల్లడైంది. ఈ సర్వేని ఏప్రిల్ 2011లో నిర్వహించారు. మార్చిలో గూగుల్ బ్రౌజర్ క్రోమ్ షేర్ 11.5 శాతం ఉండగా ఏప్రిల్ నాటికి 11.9 శాతానికి పెరిగింది. మైక్రోసాఫ్ట్ ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్ మాత్రం మార్చిలో 55.9 శాతం నుండి 55.1 శాతానికి పడిపోయింది.

వెబ్ బ్రౌజర్లు మార్కెట్‌లో కొత్త సర్వే నిర్వహించిన నెట్ అప్లికేషన్లు వెల్లడించిన సమాచారం ప్రకారం మార్కెట్‌లో మైక్రోసాఫ్ట్ ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్ వాటా నిరంతరం 55.1శాతం వుంటోంది. అయితే మైక్రోసాఫ్ట్ ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్–9 విడుదల తర్వాత మార్కెట్‌లో తన పాపులారిటీ తగ్గిపోయింది. ఈ తరుణంలో గూగుల్ వెబ్ బ్రౌజర్ 'క్రోమ్' తన హవా కొనసాగిస్తోంది.

ఇదిలావుండగా, ప్రపంచంలో ఎక్కువ మంది ఉపయోగిస్తున్న మొజిల్లా ఫైర్‌ఫాక్స్ రెండవ స్థానంలోకి వెళ్లిపోయింది. దీనికి కారణం– ఇటీవల మొజిల్లా ఫైర్‌ఫాక్స్ 4, మైక్రోసాఫ్ట్ ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్ 9 వెర్షన్లను విడుదల చేయడమే! వీటికి పోటీగా గూగుల్ తన కొత్త బ్రౌజర్ 'క్రోమ్' 11 వెర్షన్ విడుదల చేసింది. మిగతా బ్రౌజర్లతో పోల్చుకుంటే 'క్రోమ్' బ్రౌజర్‌లో హెచ్‌టిఎంఎల్ వాయిస్ ఇన్‌పుట్, వాయిస్ టెక్స్ట్ కన్వర్జేషన్స్ విత్ గూగుల్ ట్రాన్సిలేటర్ లాంటివి ఉండడంతో ఎక్కువ మంది దీనిని వాడుతున్నట్లు పలు సర్వేలు తెలుపుతున్నాయి. ఆపిల్ కంపెనీకి చెందిన వెబ్ బ్రౌజర్ సఫారీ కూడా కొంతమేర



మెరుగుపడింది. ఈ క్రమంలో వినియోగదారులు ఎప్పుడూ అప్‌డేటెడ్, ఎక్కువ ఫీచర్స్ ఉన్నవాటిని మాత్రమే ఆదరిస్తారనే వాస్తవం మరోసారి వెల్లడైందని, వెబ్ బ్రౌజర్స్ అన్నింటికి ఇదో చక్కని పాఠం అని కంప్యూటర్ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

- కె.ఎక్స్.రాజు

నగరంలో ఒకరోజు

నగరంలో హృదయం మరణిస్తుంది
కొన్ని అసంపూర్ణ కలల మధ్య
కొత్తగా విచ్చుకుంటున్న స్వార్థపు పుష్పాలు
నాకు తెలియకుండానే నిన్ను తినేసే
విషపు పురుగులు!

విశ్వం పరివ్యాప్తం అవుతూ
నన్ను కుంచింపజేస్తున్న
అదృశ్య దుష్టశక్తులు
బలవంతంగా మనుషుల బోనులోకి లాక్కెళ్తున్నాయి!
ఒంటరితనంలో నేను, నాగది
మాట్లాడే ఒక స్నేహితుడుంటే బాగుండేది
నా మానసిక అందానికి ఆనందపడే
ఒక దోస్త్ ఉంటే ఇంకా బాగుండేది!

దూరపు కొండపై ఏటవాలుగా నిల్చుని
గట్టిగా అరుస్తున్నాను



మానవత్వపు సుకుమార స్పర్శకోసం
ఎంత రోదించినా నా కన్నీళ్లు
కదిలి శిలలను సైతం కరిగించలేదు!
జీవితం అనే నాటకంలో పాత్రలం మనమే
ప్రేక్షకులమూ మనమే
యవనిక మాత్రం మారుతూ ఉంటుంది
దేహాల నిండా పూసుకున్న రంగుల మర్మ
రహస్యం ఎవరు పసిగట్టగలరు!

రోడ్లపై ఒకటే పరుగులు
ఎవరూ నిదానంగా, నిటారుగా నడవడం లేదు
దించిన తలలు ఎత్తకుండా
మొహాలకు అలసటను అతికించుకుని
జాగ్రత్తగా రూపాయల్ని లెక్కిస్తున్నారు!
బహుశా నగరతత్వం ఇంతేనేమో
కొన్ని పరిచయ ముఖాలు తప్పించుకుంటూ
మనిషి నిండా ఆధునికత కప్పుకుంటూ
అదృశ్యమౌతున్న వైనం...!
చివరకు నన్ను చీదరించుకుంటూ
దూరంగా పారిపోతున్న నగరవైభవం!

- ఇ. వెంకటేష్

కవిత్వమ్

మరణ శిక్ష

బ్రతికే వాడివే..
ఇంకా బ్రతికేవాడివే..
మద్యం తాగే మాయదారి
అలవాటు కనుక నీకు లేకపోతే..
నీవు చేసిన కష్టమంతా...
నీకు నీ వాళ్లకే దక్కేదే..
నీవు మహరాజుగా బతికే వాడివే..
నీవాళ్లు ఏ రోజూ...
సుఖం, సంతోషం పడకుండా
సారాయి సైతాన్ దీవెన
చక్కగా ఫలింపజేశావ్
అవును నీవు ముద్దాయివే...
వారి మనుసులు ఎప్పుడో
నీకు మరణ శిక్ష విధించే వుంటాయి..
మద్యం రుచి మరిగిన నీ నాలుక

నీ మనస్సు చెప్పే మాట ఎప్పుడూ వినలేదు.
మద్యం మానమని నీ మనస్సు శంఖంలా
ఎన్ని సార్లు మ్రోగినా...
ఎందరో మంచి మనస్సుతో
నీ బతుకు కోరి మంచి సలహాలిచ్చినా...
పనికిమాలిన వాటిలా విదిల్చావ్
బతికినంత కాలం
మద్యానికి బానిసయిన నీవు
మరణంతో విముక్తమౌతావు కాబోలు..
కానీ మద్యం అణుబాంబుతో
నిర్జీవంగా మారిన నీ కుటుంబం
పచ్చగా చిగురించాలంటే...
ఎన్ని తరాలు పడుతుందో...! ఏమో..!

- వెల్దుర్తి హరిసింహ నాయుడు

కలలు మరణించిన వేళ

అణు విద్యుత్తంటూ ఉద్గారాలంటూ
కార్మగారాల్లో దాచిన విషం
మనిషికి అనుభవంలోకి రాకుండా పోతుందా?
ఒంకర పోయిన కాళ్లు
మెలిదిరిగిన నడుములూ
ఎదగని మెదళ్లు
కఠిన గరళానికి పుష్పించిన సుందరపుష్పాలు
అవి ఏ పూజకు
పనికి వచ్చే పుష్పాలు?
గుండెల్లో జోగుతున్న వెన్నెలని
కళ్లల్లో కురిసే మంచు జల్లులని
పాదాల కింద నిదురపోయే గడ్డి పరకల మెత్తదనాన్ని
గడ్డపారలతో పెకిలించి భూస్థాపితం చేసిన
ఈ రసాయన భూతాలను
ఏ దేశ న్యాయస్థానాల్లో ఉరితియ్యాలి?
గాలిలో దీపమై బతికే అభాగ్యజీవుల

హ్యూమన్ రైట్స్
సుతిమెత్తని కలల నిదురలో
శ్వేతవర్ణ మబ్బుల రథాలపై
ప్రయాణం చేస్తున్నప్పుడు
విషవాయువుల చీకటి రాత్రి
సునామీ అయి ముంచెత్తినప్పుడు
కాలుష్య పడగ నీడలో
సమాజపు వింత చూపులకు
సామాజికుల సానుభూతులకు
తల వంచుకుని
వ్యక్తిత్వ లేమి ఎన్నాళ్లు?
మల మూత్రాలను ఎత్తి పోసే
తల్లి చేతుల ఆసరా ఎంత కాలం?
మొద్దునిద్దుర తీసే భల్లూక ప్రభుత్వాలని
ఎవరు నిలదీయాలి?
ఏ సంబంధమూ లేని విపత్కరాన్ని
తామెందుకు మొయ్యాలనే పరిజ్ఞానం కూడా లేని
అరవిరిసిన పద్మాలకు
రాలిపోయిన ఆ రెక్కలను
సానుభూతిగా కన్నీటితో
దోసిళ్లలోకి తీసుకోవడం తప్ప!!

- తమ్మెర రాధిక

నవ్వుల్ - పువ్వుల్

గుర్తించడం ఎలా?

రాంబాబు: ఒరే! స్కూల్లో మీ అబ్బాయిని గుర్తించడం ఎలా?

సోంబాబు: చాలా సులభం. స్కూల్లో ఒకే ఒక పిల్లవాడున్నాడు. వాడు... టీచర్ బోర్డు మీద రాసిన వెంటనే నోట్సులో రాసుకుంటాడు. టీచర్ డస్టర్‌తో చెరిపేయగానే వాడు ఎరేజర్‌తో నోట్సులో చెరిపేస్తాడు. వాడే నా కొడుకు.

భవిష్యత్

టీచర్ : నేను ఒక మనిషిని చంపాను. ఫ్యూచర్ టెన్స్ చెప్పరా బంటీ.

బంటి : జైల్లో వుంటారు సార్.

నిదానం

సుబ్బారావు: ఏంట్రా అంత నిదానంగా రాస్తున్నావు?

అప్పారావు: నేను మా మనవడికి ఉత్తరం రాస్తున్నాను. వాడికి ఆరేళ్లని నీకు తెల్సుకదా. ఉత్తరం స్పీడ్‌గా రాస్తే వాడు చదవలేడని నిదానంగా రాస్తున్నానంతే.

హచ్

(కుక్క వెంబడిస్తోంటే పున్నారావు నవ్వుతూ దౌడు తీస్తున్నాడు)

వెంకట్రావు: ఏంట్రా కుక్క వెంబడిస్తుంటే అలా నవ్వుతున్నావు?

పున్నారావు: అరే నాయనా! నేను హచ్ నెట్‌వర్క్ నుంచి ఎయిర్‌టెల్‌లోకి మారి చాలా రోజులైంది. అయినా హచ్ నన్ను వదలట్లేదు. అందుకు...

క్యాపిటల్

గోపీ: ఏంట్రా రాజూ! హైదరాబాద్ వచ్చావు?

రాజు: ఏంలేదురా! ఈ దరఖాస్తు మీద ఫిల్ అప్ ఇన్ కాపిటల్ అని వుంది. అందుకే ఇక్కడికొచ్చా.

కప్పు

వెంకన్న: ఏంట్రా అందరూ అలా పరిగెడుతున్నారు?

సుబ్బన్న: పరుగు పందెంరా బాబూ. గెల్చినవాడికి కప్పు ఇస్తారు.

వెంకన్న: గెల్చినవాడికి ఒక్కడికే కప్పు ఇచ్చేట్లయితే...మిగతావారంతా పరిగెట్టడమెందుకు? దండగ!

ఏది ముందు?

(రాము, సోము హోటల్‌కెళ్లారు)

రాము: ఒరే గుడ్డు ముందా? కోడి ముందా?

సోము: ...(ఆలోచిస్తుండగా)

సర్వర్: ముందు ఏది ఆర్డరిస్తే అది ముందు సార్.

విడాకులు

లాయర్: ఏమయ్యా? మీ దంపతులిద్దరూ విడాకులు కోరుకుంటున్నారు బానేవుంది. మరి మీ ముగ్గురు పిల్లల్ని ఎలా పంచుకుంటారు?

వ్యక్తి: ఒకే లాయర్‌గారూ. అయితే మేం ఇద్దరం వచ్చే సంవత్సరం వచ్చి విడాకులు తీసుకుంటాంలెండి.

లాయర్: అదేం లెక్క?

వ్యక్తి: అప్పటికి మీరు చెప్పిన లెక్క సరి అవుతుందిలెండి!

18 ఏళ్ల పైవారికే

వ్యక్తి: ఏంటండీ. సినిమాకు మీరు ఇంతమంది వచ్చారు? అంత బావుందా?

గుంపులో ఒకరు: సినిమా 18 పైబడినవారికే అన్నారైండి అందుకని.

త్వరగా

(భార్యాభర్తలిద్దరు ఓసారి హోటల్‌కెళ్లారు)

భర్త: త్వరగా తాగు.

భార్య: ఎందుకనండీ.

భర్త: ఎందుకేంటే పిచ్చిమొహమా! హాట్ కాఫీ 5 రూపాయలు. కోల్డ్ కాఫీ 10 రూపాయలు.

కె. సాహిల్, హైదరాబాద్.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్



పి.వి. దాసు

తొలినాళ్ళలో తెలుగు నాట సినీ రంగానికి ఊపిరి పోసిన పెద్దల పేర్లను రాయమంటే, అందులో ముందు వరుసలో వచ్చే పేరు - పి.వి. దాసు. తెర మీద బొమ్మలు తేట తెలుగులో మాట్లాడడం మొదలుపెట్టిన తరువాత సినీ రంగానికి ఆయన చేసిన సేవలు అపూర్వం. సినిమా షూటింగంటే బొంబాయి, కలకత్తా, కొల్హాపూర్‌ల చుట్టూ తిరుగుతున్న రోజుల్లో ఆ ధోరణిని మార్చడానికి సాహసించిన మార్గదర్శి ఆయన. దక్షిణ భారతదేశాన్ని, అందులోనూ అప్పటి మన ఉమ్మడి మద్రాసు రాష్ట్ర రాజధాని అయిన మద్రాసు మహానగరాన్ని షూటింగులకు కేంద్రంగా మలిచేందుకు గట్టి పునాది వేసిన ఘనత ఆయనది. తమిళ వాణిజ్య ప్రముఖులతో కలసి, మద్రాసులో 'వేల్ పిక్చర్స్ స్టూడియో' పేరిట చక్కటి స్టూడియో నిర్మాణం జరిపిన తెలుగు బిడ్డగా పి.వి. దాసు చిరస్మరణీయులు.



మినర్వా టాకీసు

తెలుగు టాకీ తొలి కిరణం పి.వి. దాసు

పి.వి. దాసు పూర్తి పేరు - పినపాల వెంకట దాసు. కృష్ణాజిల్లా బందరులో పుట్టి, పెరిగారు. స్కూల్ ఫైనల్ దాకా చదువుకున్నారు. చదువు పూర్తయ్యాక ఆయన నెల్లూరులోని తమ బావ గారి దగ్గరకు వెళ్ళారు. పెట్రోలు ఏజెన్సీ వ్యాపారస్థులైన బావ గారి దగ్గర గుమస్తాగా పనిచేస్తూ, వ్యాపారంలోని మెలకువలు నేర్చుకున్నారు. అక్కడ కొన్నాళ్ళున్న తరువాత దాసు మళ్ళీ బందరుకు వచ్చేశారు. ఇదంతా 1915 నాటి సంగతి. సొంత ఊరికి వచ్చిన తరువాత ఆయన కృష్ణాజిల్లా మొత్తానికీ 'బర్మా షెల్' సంస్థ వారి కిరోసిన్, పెట్రోలు ఏజెన్సీ తీసుకున్నారు. ఆ వ్యాపారానికి తోడుగా ఓ సోడా ఫ్యాక్టరీ పెట్టారు. అలాగే, ఐస్ ఫ్యాక్టరీని నెలకొల్పి, నడిపారు. అప్పట్లో ఆయన చేసిన ప్రతి వ్యాపారమూ మూడు పువ్వులు, ఆరు కాయలుగా నడిచింది. ఈ వ్యాపారాలే కాక, ఆయనకు సొంతంగా చాలా భూములు కూడా ఉండేవి. ఇటు వ్యాపారంలో, అటు వ్యవసాయంలో ఆయన బోలెడంత డబ్బు సంపాదించారు.

ప్రదర్శక రంగం నుంచి చిత్ర నిర్మాణానికి...

పి.వి. దాసుకు కళలంటే మహా ప్రీతి. ఆ కళాభిరుచి కారణంగా ఆ కాలంలోని ఉత్తమ కళాకారులతో, కవులతో, సాహితీవేత్తలతో ఆయన పరిచయాలు పెంచుకున్నారు. నాటక రంగ అభివృద్ధి కోసం కృషి చేశారు. పలు నాటక ప్రదర్శనల్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో మంచి నాటకాలు కావాలంటూ రచనలపై చర్చలు జరిపేవారు. ఆ రోజుల్లో నాటకానికీ, సినిమాకూ ఉన్న విడదీయరాని సంబంధం వల్ల ఆయన సహజంగానే సినీ రంగం వైపు కూడా ఆకర్షితులయ్యారు. సినీ రంగానికి తెలుగునాట ప్రాచుర్యం కల్పించాలనే కోరిక కలిగింది. అలా ఆయన మూకీ చిత్రాల రోజుల్లోనే చిత్రసీమలోకి వచ్చారు. సినిమాల ప్రదర్శన నిమిత్తం కొందరు మిత్రులను కూడగట్టుకొని, బందరులో 1925లో 'మినర్వా' హాలు నిర్మించారు. (ఇప్పటికీ అది 'మినర్వా టాకీసు' పేరుతో నడుస్తోంది). అలాగే, ఆ తరువాతి రోజుల్లో గుంటూరు జిల్లా రేపల్లెలో 'శ్రీకృష్ణా' అంటూ మరో సినిమా హాలు కట్టారు. అలా చలనచిత్రాల ప్రదర్శక రంగంలోకి వచ్చిన పి.వి. దాసు సహజంగానే కాలక్రమంలో చిత్ర నిర్మాణం వైపు మళ్ళారు. 1931 నాటికల్లా భారతదేశంలోకి టాకీలు వచ్చేసినా, తెలుగు చిత్రాలు తీసే నిర్మాతలందరూ బొంబాయి, కలకత్తా, కొల్హాపూర్ నగరాలకు వెళ్ళి, అక్కడే చిత్ర నిర్మాణం చేయాల్సి వచ్చేది.

రాజా వారి బంగళాలో రమ్యమైన స్టూడియో

మనకే మద్రాసులో స్టూడియో ఉంటే, సమస్యలు చాలా వరకు పరిష్కారమవుతాయనే ఉద్దేశం పి.వి. దాసుకు కలిగింది. దాంతో, మద్రాసుకు చేరుకొని, తమిళనాట చలనచిత్ర ప్రదర్శకులైన ఎం.టి. రాజన్, స్వామి, సి.పి. సారథి, జయంతీలాల్ ఠాకూర్‌లనూ, అలాగే చల్లపల్లి రాజా గారి లాంటి పెద్దలనూ కలుపుకొని, 'వేల్ పిక్చర్స్'ను స్థాపించారు. వాటాల జారీతో దాన్ని 'వేల్ పిక్చర్స్ లిమిటెడ్'గా తీర్చిదిద్దారు. మద్రాసులోని తేనాంపేట ప్రాంతంలో ప్రస్తుత వీనస్ కాలనీ (ఒకప్పుడు వీనస్ స్టూడియో)కి దగ్గరలో పిఠాపురం రాజా వారికి 'డన్‌మోర్ హౌస్' అనే పెద్ద బంగళా ఉండేది. పి.వి. దాసు అది తీసుకొని, దానిలో 'వేల్ పిక్చర్స్' పేరున సినిమా చిత్రీకరణలకు అనువైన స్టూడియోను నెలకొల్పారు. అప్పటికి మద్రాసులో 'శ్రీనివాస సినీటోన్' అనే మరో సినిమా సంస్థ ఉంది. దక్షిణ భారతదేశంలోనే తొలి టాకీ స్టూడియో అయిన 'శ్రీనివాస సినీటోన్' ఆ సంస్థదే!

'శ్రీనివాస సినీటోన్' కన్నా ఎంతో ఉత్తమంగా, నాణ్యమైన సాంకేతిక వసతులతో 'వేల్ పిక్చర్స్ స్టూడియో' ఏర్పాటైంది. వేల్ పిక్చర్స్ స్టూడియో నిర్మాణం, నిర్వహణకు పి.వి. దాసు ఎంతో శ్రమించారు. 'వేల్ పిక్చర్స్' కంపెనీ వారు విశేషంగా పరిశ్రమించి, వ్యయానికి లెక్క చేయకుండా, ఉత్తమమైన చిత్రాలను తయారుచేయాలనే లక్ష్యంతో పాటుపడ్డారు. పైగా, వాళ్ళు స్టూడియో నిర్మించుకున్న 'డన్‌మోర్ హౌస్' అన్ని విధాల వాళ్ళ ఉద్యమానికి అనుకూలమైంది. స్టూడియో కోసం ఆధునిక యంత్ర సామగ్రిని చాలా వరకు తెప్పించారు. అజంతా, ఎల్లోరా చిత్తరువుల సంప్రదాయాలను అనుసరించి, వస్తు వాహనాలను విరివిగా తయారు చేయించారు. ఆంధ్రదేశంలోనూ, అరవ దేశంలోనూ ఉండే శిల్పులు, వడ్రంగుల్లో ప్రవీణులైన కొందరిని రప్పించి, స్టూడియోకు అవసరమైన సరంజామాను అమర్చుకున్నారు.

స్టూడియోకు సారథ్యం

మద్రాసులోని 'డన్ మోర్' భవనంలో కొత్తగా స్థాపించిన వేల్ పిక్చర్స్ కంపెనీ వారి స్టూడియోను 1934 జూలై 31 మంగళవారం ఉదయం 8 గంటలకు మద్రాసు రాష్ట్ర గవర్నర్ సర్ మహమ్మద్ ఉస్మాన్ సాహెబ్ బహద్దూర్ ప్రారంభించారు. పురప్రముఖులు పలువురు ఆ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. 'వేల్ పిక్చర్స్' కంపెనీ డైరెక్టర్ల పక్షాన గవర్నర్ గారికి, పి.వి. దాసు సన్మానపత్రం సమర్పించారు.

'వేల్ పిక్చర్స్' సంస్థ తమ స్టూడియోలో తెలుగుతో పాటు పలు తమిళ చిత్రాలను కూడా నిర్మిస్తూ వచ్చింది. డైరెక్టర్లు, ఇతర నిర్వాహకులను కూడా తెలుగు చిత్రాలకు తెలుగు వాళ్ళనూ, తమిళ చిత్రాలకు తమిళ వాళ్ళనూ ఏర్పాటు చేసుకున్నారు. అప్పట్లో ఈ స్టూడియోలో కెమేరామన్‌గా కె. రామనాథ్, కళాదర్శకుడిగా ఏ.కె. శేఖర్, రచయితగా టి.ఎస్. మురుగదాస నియమితులయ్యారు.

చిత్ర నిర్మాణం, స్టూడియో ప్రారంభం కాక ముందు నుంచి స్టూడియోలోనే ఉండి, అన్ని పనులూ దాసే స్వయంగా నిర్వహించుకొనేవారు. ఆ రకంగా స్టూడియోలో సాంకేతిక విషయాలన్నిటిలో ఆయన చక్కటి పరిజ్ఞానం సంపాదించారు. ఆ పరిజ్ఞానం ఎంతటిదంటే - అవసరాన్ని బట్టి సినిమా షూటింగులో ఆయనే సౌండ్ రికార్డు చేసేవారు. ఎడిటింగ్ బాధ్యతలను కూడా ఆయనే నిర్వహించేవారు.

బందరు సమాజంలో కీలకపాత్ర

'వేల్ పిక్చర్స్' వ్యవహారంతో మద్రాసుకు తరలిరావడానికి ముందు బందరులో ఆయన కీలక భూమికలే నిర్వహించారు. బందరులో మునిసిపల్ సంఘంలో సభ్యులుగా వ్యవహరించారు. అలాగే, జిల్లా బోర్డులో కూడా సభ్యులుగా వ్యవహరించారు. పట్టణంలో ప్రముఖులుగా నిలిచారు. అయితే, 'బర్మా షెల్' ఏజెంటుగా ఉన్నప్పుడు, బందరు, రేపల్లెలో సినిమా హాళ్ళ నిర్వహణప్పుడు, పట్టణ సంఘాల్లో సభ్యులుగా ఉన్నప్పుడు కన్నా మద్రాసులో వేల్ పిక్చర్స్

నిర్మాణంతో ఆయనలో తేజం ఆరంభమైంది. వేల్ పిక్చర్స్ స్టూడియోను నిర్మించిన తరువాతి సంవత్సరాలు ఆయన జీవితంలో ఎంతో ప్రకాశవంతంగా సాగాయని చెప్పవచ్చు. ఆ స్టూడియో నిర్మాణంతో మద్రాసులో స్టూడియోల లోటు తీరడమే కాక, ఆ పతాకం నుంచి వెలువడిన 'సీతాకల్యాణము', 'శ్రీకృష్ణలీలలు' టాకీ చిత్రాలు తెలుగు టాకీలలో ఉత్తమ శ్రేణికి చెందినవిగా నిలిచాయి. ఆ రెండు మహత్తరమైన టాకీలను ప్రసాదించి, తెలుగునాటి నంతటినీ వినోదింపజేసిన నిపుణమతి - పి.వి. దాసు.

దక్షిణాది తయారీ తొలి తెలుగు టాకీ

'వేల్ పిక్చర్స్' తొలి చిత్రం - తెలుగు సినిమా 'సీతా కల్యాణము' (1934). ఆ స్టూడియోలో ప్రథమంగా నిర్మించినది కూడా ఈ చిత్రమే! ఆ రకంగా మద్రాసులో తెలుగు చలనచిత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టింది - పి.వి. దాసు. అప్పటి దాకా ఉత్తర భారతదేశంలోని నగరాల్లో రూపొందుతున్న తెలుగు చిత్రాలకు భిన్నంగా, దక్షిణ భారతదేశంలోనే తయారైన తొలి తెలుగు చిత్రంగా 'సీతా కల్యాణము' చరిత్ర సృష్టించింది. వేల్ పిక్చర్స్ అధినేతలు తమ స్టూడియోలో పని చేయడానికి బొంబాయి, కలకత్తాల నుంచి సుశిక్షితులైన సాంకేతిక నిపుణులను పిలిపిద్దామని భావించారు. కానీ, ఈ సాంకేతిక నిపుణుల త్రయం మాత్రం అలా చేయనక్కరలేదని వారించింది. స్థానికులనే రప్పించి, వారికి అద్భుతమైన శిక్షణనిచ్చింది. రాయ్ థియేటర్‌లో చీఫ్ ప్రొజెక్షనిస్టుగా పని చేసే సి.ఇ. బిగ్స్ ఈ స్టూడియోలో శబ్దగ్రహణ శాఖకు అధిపతిగా వచ్చారు. ఎంతోమంది సౌండ్ ఇంజనీర్లకు ఆయన శిక్షణనిచ్చారు. ఇలా ఎన్నో మౌలిక సదుపాయాలతో, అప్పటికి అధునాతన సాంకేతిక సౌకర్యాలతో స్టూడియో అనుపమాన స్థాయిలో ఉండేది.

ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలను బెజవాడ సమీపంలోని కొండపల్లి దగ్గర అడవుల్లో ఔట్‌డోర్‌లో తీయడం విశేషం. అలా తెలుగు నాట ఔట్‌డోర్ చిత్రీకరణకు కూడా ఈ సినిమాయే శ్రీకారం చుట్టింది. 'సీతా కల్యాణము'లో వచ్చే ఊరేగింపు సీన్లు, జనకుని రాజాస్థానం వగైరా సీన్లన్నీ బెజవాడ సమీపంలోని చల్లపల్లి సంస్థానంలో తీశారు. "అప్పట్లో బెజవాడలోని 'మారుతీ సినిమా', 'శ్రీదుర్గాకళామందిరం' రెండు హాళ్ళలోనూ ఏకకాలంలో 'సీతా కల్యాణము' సినిమా విడుదలైంది. నాకు తెలిసి అలా ఒకే కేంద్రంలో ఎక్కువ థియేటర్లలో సినిమా రిలీజు కావడమనేది తెలుగులో ఆ సినిమాతోనే మొదలు!" అని అప్పట్లో తన 15 ఏళ్ళ వయసులో ఆ సినిమా చూసిన సంగతులను తొలితరం సినీ జర్నలిస్టు అయిన 91 ఏళ్ళ మద్దాలి సత్యనారాయణ శర్మ (ఎం.ఎస్. శర్మ) గుర్తు చేసుకున్నారు. మొత్తం మీద ఉత్తరాది వారి డబ్బులతో కాకుండా, తెలుగు వారి పెట్టుబడితో, దక్షిణాదిన రూపుదిద్దుకున్న తొలి టాకీ 'సీతా కల్యాణము' విశేష జనాదరణను పొందింది.

చిత్ర నిర్మాణ సారథిగా దాసు కృషి

'సీతాకల్యాణము'లో ఓ దృశ్యం

వేల్ పిక్చర్స్ సంస్థ మరోపక్క 'మార్కండేయ' తదితర తమిళ టాకీలు కూడా నిర్మించింది. ఇక, వారి రెండో తెలుగు చిత్రం - 'శ్రీకృష్ణలీలలు' (1935). దానికీ సారథ్యం - పి.వి. దాస్‌దే! ఆయన గొప్పదనం ఏమిటంటే - ఎప్పటికప్పుడు కొత్త కొత్త ప్రతిభావంతులను తెర మీదకు తీసుకువచ్చేందుకు అవిశ్రాంతమైన కృషి చేసేవారు. సరిగ్గా గమనిస్తే - 'వేల్ పిక్చర్స్'లో ఏ చిత్రానికి ఆ చిత్రం నటీనటులు మారిపోయేవారు. ప్రతి సినిమాకూ వేర్వేరు నటీనటులను తీసుకొనేవారు. 'శ్రీకృష్ణలీలలు' విడుదలప్పుడు ప్రచారం విషయంలో పి.వి. దాసు మరో కొత్త పుంత తొక్కారు. ప్రత్యేకంగా విమానం అద్దెకు తీసుకొని, ప్రముఖ పట్టణాలలో గగనతలం నుంచి కిందకు సినిమా ప్రచార కరపత్రాలను వెదజల్లే ఏర్పాట్లు చేశారు. ఆ రోజుల్లో విమానమే వింత అయితే, విమానంలో నుంచి కరపత్రాలను జారవిడవడం మరో పెద్ద వింత. ఆ వినూత్న ప్రచార వ్యూహం జనంలో పెద్ద క్రేజును సృష్టించింది.

ఆ తరువాత మూడో తెలుగు ప్రయత్నంగా, స్వీయ దర్శకత్వంలో 'శశిరేఖా పరిణయము' ('మాయాబజార్' - 1936) చిత్రాన్ని పి.వి. దాసు ప్రారంభించారు. అయితే, షూటింగ్ సగంలో ఉండగానే, దాసు హఠాన్మరణం చెందారు. వేల్ పిక్చర్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.టి. రాజన్ ఆ చిత్రాన్ని పూర్తి చేసి, విడుదల చేశారు. ఆ సినిమా చివరన "రిమెంబర్ ఇట్ ఈజ్ ఏ వేల్ పిక్చర్స్ ప్రొడక్షన్" అంటూ ఆంగ్లంలో టైటిల్ కార్డు వేశారు. తెలుగు చిత్రాలకు అలా వేయడం కూడా అదే ప్రథమం.

మచిలీపట్నంలో ఓ సినిమా హాలు యజమానిగా మొదలై వేల్ పిక్చర్స్ స్టూడియోకు బిజినెస్ డైరెక్టర్‌గా

ఎదిగిన పి.వి. దాసు వ్యాపారానుభవం అపారం. అలాగే, చిత్ర నిర్మాణంలోని ప్రతి చిన్న అంశం మీద ఆయనకు అమితమైన పట్టు ఉండేది. ఛాయాగ్రహణం లాంటి సాంకేతిక అంశాల్లో సైతం ఆయనకున్న పరిజ్ఞానం అపారం. జీవించిన కొద్దికాలంలోనే పి.వి. దాసు, 'సౌత్ ఇండియన్ సౌండ్ కార్పొరేషన్' అనే సంస్థను స్థాపించి, శబ్దగ్రహణానికి కావాల్సిన పరికరాలెన్నిటినో దిగుమతి చేసి, ఇతరులకు సరఫరా చేసేవారు.

కళ విషయంలో కల్లలైన కలలు

చిత్ర నిర్మాణ, దర్శకత్వ శాఖలకు సంబంధించి దాసు ఎన్నో కలలు కన్నారు. అయితే, 'శశిరేఖా పరిణయము' చిత్రాన్ని పూర్తి చేయకుండానే, ఆయన అకస్మాత్తుగా మరణించడంతో అవన్నీ కలలుగానే మిగిలిపోయాయి. ఇప్పటికి సరిగ్గా 75 ఏళ్ళ క్రితం 1936 మే 10వ తేదీ ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో మద్రాసులో పి.వి. దాసు మరణించారు. తేనాంపేటలోని వేల్ పిక్చర్స్ స్టూడియోకు ఎదురుగా ఉన్న స్వగృహంలో మరణించేనాటికి పి.వి. దాసు వయస్సు కేవలం 46 ఏళ్ళే! ఆయనకు భార్య, ఏడుగురు పిల్లలు ఉండేవారు. పి.వి. దాసు మేనల్లుడే తరువాతి రోజుల్లో ఛాయాగ్రాహకుడిగా ఎంతో పేరు తెచ్చుకున్న బందరు వాస్తవ్యుడు - పి. శ్రీధర్.

ఆదర్శాలన్నీ సఫలం కాకుండానే, దాసు మరణించిన తరువాత 'వేల్ పిక్చర్స్' ప్రాభవం కూడా క్రమంగా క్షీణిస్తూ వచ్చింది. ఆ పతాకం నుంచి మళ్ళీ తెలుగు సినిమాలేవీ రాలేదు. కొన్ని తమిళ చిత్రాలను రూపొందించినప్పటికీ, చివరకు ఆ సంస్థ చిక్కుల్లో పడింది. పి.వి. దాసు మరణం తరువాత స్టూడియో నిర్వహణపై క్రమంగా నీలినీడలు పరుచుకున్నాయి. స్టూడియోను మద్రాసులోనే తేనాంపేట నుంచి గిండీ ప్రాంతానికి మార్చారు. ఆ తరువాత సంస్థ దివాళా తీసి, సాంకేతిక సామగ్రిని అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఆ స్టూడియో ప్రాంతమే ఆ తరువాత 'నరసూస్ కాఫీ' అధినేతల చేతుల్లోకి వెళ్ళి, 'నరసూ స్టూడియోస్'గా అవతరించింది. ఆ తరువాత అదీ పోయింది. ఇప్పుడు ఆ స్థలమంతా గిండీ వంతెన పక్కనే క్యాంపా కోలా మైదానంగా కనపడుతుంది.

ఏమైనా, పి.వి. దాసు సారథ్యంలో మొదలైన వేల్ పిక్చర్స్ సంస్థ అప్పట్లో ఓ సంచలనం. ప్రతిభావంతులకు ఆటపట్టు. తరువాతి రోజుల్లో ప్రముఖ సంగీత దర్శకుడై, మాస్టర్ వేణుగా ప్రసిద్ధికెక్కిన బందరు కుర్రాడు మద్దూరి వేణుగోపాల్ సైతం వేల్ పిక్చర్స్‌లో సంగీత విభాగంలో హార్మోనిస్టుగా పనిచేసినవారే! ఎంతో కాలం చిత్రపరిశ్రమలో లేకపోయినా, లెక్కకు మించిన చిత్రాలు తీయకపోయినా సరే, తెలుగు చలనచిత్ర రంగ ప్రారంభ దినాల్లో పి.వి. దాసు ప్రముఖ పాత్ర పోషించారు. ఆయన అవిస్మరణీయుడైంది అందుకే!

- రెంటాల జూనియర్

స్వీయ చరిత్ర... పర్యాటక రచనల మేలు కలయిక



చిత్తూరు జిల్లా రచయితల సంఘ అధ్యక్షులు కట్టమంచి బాలకృష్ణా రెడ్డి గారి తాజా రచన ఈ "కొన్ని కలలు – కొన్ని జ్ఞాపకాలు". వీరు ఇదివరకే వెలువరించిన "యూరప్ జ్ఞాపకాలు" పాఠకులను యూరప్ ఖండానికి తీసుకెళ్ళి అలరించి ఉన్నాయి. 187 పేజీల ఈ పుస్తకంలో ప్రథమ భాగంగా తన స్వీయ చరిత్రను పేర్కొన్నారు. చిత్తూరులో జన్మించిన రచయిత పి.సి.ఆర్ ఉన్నత పాఠశాలలో తాను చదువుకున్నప్పటి సంగతులు వివరించారు. దేశానికి స్వాతంత్ర్యం రావటానికి ముందు కొన్ని సంవత్సరాలు, తదనంతర కొంత కాలం ఆయన తన విద్యాభ్యాసం గురించి ఆసక్తికరంగా చెప్పారు. అప్పటి ఆయన సహవిద్యార్థులు, మిత్రుల గురించి విసుగు కలగని విధంగా వర్ణించారు. ఆ కాలంలో రచయితకు విద్యాబుద్ధులు నేర్పిన ఆదర్శ ఉపాధ్యాయుల పట్ల తన గౌరవ మర్యాదలు గొప్పగా ప్రదర్శించారు. ఈ చక్కటి పుస్తకాన్ని తన బాల్య స్నేహితుడు కీర్తిశేషులు భక్తవత్సులుకు అంకితం చేసి ఆయనతో తనకున్న సాన్నిహిత్యాన్ని భావోద్వేగంతో జ్ఞాపకం చేసుకున్నారు. పుస్తకంలోని ద్వితీయ భాగం మొత్తం రచయిత చేసిన పర్యటనల అనుభవాలు ఆసక్తికరంగా చదివిస్తాయి. బాలకృష్ణారెడ్డి గారికి పర్యటించడం, తన అనుభవాలను పదుగురికి చెప్పటం చాలా ఇష్టం. రాహుల్ సాంకృత్యాయన్ ప్రపంచమంతా ఒంటరిగానే పర్యటిస్తే ఈ రచయిత ప్రతి యాత్రా ఆత్మీయులతోనూ, స్నేహితులతోనూ చేయటం విశేషం. ఇందులో రచయిత గావించిన అండమాను యాత్ర, బుద్ధ పరిక్రమణ, జమ్ము వైష్ణవి దేవి మధురస్మృతి శీర్షికలు మనల్ని ఆయా ప్రాంతాలకే తీసుకుపోతాయి. మూడింటిలోనూ ముఖ్యంగా తన అండమాన్ యాత్రకు రచయిత అత్యంత ప్రాముఖ్యత ఇచ్చారు. భారత స్వాతంత్ర్య పోరాట యోధులను బ్రిటిష్ పాలకులు అరెస్టు చేసి దీర్ఘ శిక్షలను విధించి నలువైపులా బంగాళాఖాతమే ఆవరించి వున్న అండమాన్ ద్వీపంలోని భయంకరమైన సెల్యులార్ జైలులో బంధించి దారుణ చిత్రహింసల పాల్జేసేవారు. స్వాతంత్ర్య వీరులు ఎందరో అక్కడ తమ ప్రాణాలు సైతం అర్పించేవారు. ఈ అంశం రచయితను ఎంతగానో ప్రభావితం చేసిన పర్యవసానంగా ఆయన అండమాన్ యాత్ర మిత్రబృందంతో చేసి మనలను సైతం తన రచన ద్వారా అండమాన్ దీవికే తోడ్కొని వెళతారు. కట్టమంచి బాలకృష్ణా రెడ్డి స్వతహాగా హేతువాది కనుక బుద్ధుడు, ఆయన బోధనల పట్ల అత్యంత ఆసక్తి, గట్టి విశ్వాసం గలవారు. అందువల్ల బుద్ధుడు జీవితానికి సంబంధించిన ముఖ్యమైన స్థలాలన్నింటినీ భక్తిశ్రద్ధలతో గాక, చారిత్రిక దృష్టి కోణంతో కూడా సందర్శించి సమగ్ర సమాచారం పాఠకులకు అందించారు. బుద్ధుడు జన్మించిన లుంబినీ వనం, బుద్ధుడు జ్ఞానప్రాప్తి పొందిన బుద్ధగయ, ఆయన ధర్మప్రవర్తనం ప్రారంభించిన సారనాథ్ గురించిన ఎన్నో విషయాలు పరిశీలనాదృష్టితో చూచి ఆసక్తికరంగా వర్ణించారు. చివరి మజిలీ అయిన జమ్ములోని వైష్ణవి దేవాలయ యాత్ర అక్కడకు ఇంతవరకు వెళ్ళనివారు కూడా ఆమూలాగ్రంగా అవగాహన చేసుకొనే విధంగా తన పర్యటన అనుభవాలను రచయిత పాఠకులను ఆకట్టుకొనేవిధంగా వివరించారు. మొత్తంగా "కొన్ని కలలు – కొన్ని జ్ఞాపకాలు" పుస్తకం పూర్తిగా స్వీయ చరిత్ర, పర్యటన సాహిత్యాల సంగమంగా దర్శనమిస్తుంది. యాత్రల పట్ల, కొత్త చోట్లను చూచేందుకు ఆసక్తిగల వారికి ఈ పుస్తకం వొక అమృత భాండాగారం అనే చెప్పవచ్చు. పుస్తకంలో చేర్చిన కొన్ని పదుల ఫోటోలు, చిత్రాలు రచనకు వన్నె తెచ్చాయి.

కొన్ని కలలు ... కొన్ని జ్ఞాపకాలు- కట్టమంచి బాలకృష్ణా రెడ్డి, పేజీలు-188, ధర-రూ.200/-, ప్రతులు దొరకు చోటు: సువేరా ఏజన్సీస్, నెం.15-2294, బాలాజీ నగర్, చిత్తూరు - 51002, సెల్ : 9440559575.

-ఎ.జి.యతిరాజులు

నిజదర్పణం...

'అద్దంలో మనం..' చదువుతుంటే 'నిజమే కదా!' అనిపిస్తుంది. మన చుట్టూ జరుగుతున్న నిజ సంఘటనలనే, తెలిసిన సంఘటనలనే రచయిత నిర్మొహమాటంగా.. నిక్కచ్చిగా.. సాహసోపేతంగా..చెప్పారు. నాటి 'సాక్షి' వ్యాసాలు సమాజానికి ఎలా దర్పణం పట్టాయో నేటి 'అద్దంలో మనం'లో రాసిన చణుకులూ అంతేనంటారు ముందుమాట రాసిన తనికెళ్ల భరణి. ఆయనే ఇంకేమంటారంటే 'ఇది సమాజాన్ని కాచి వడపోసి కాదు అవసరమైతే కోసి, ఉప్పుపాతరేసి.. రాసిపోసిన అద్భుతం..' అన్నారు. ఇది అక్షరసత్యం. 'ముంజేతి కంకణానికి అద్దంతో పని లేనట్టే.. ఈ సంపుటికి ప్రత్యేకించి కితాబు అవసరంలేదంటూనే తన మాటలో గొప్ప ప్రశంస చేశారు శ్రీరమణ. ఈ పెద్దలు చెప్పిన మాటలు వంద శాతం నిజాలు. అందుకు అభినందనీయులు రచయిత ఎ.ఎస్.లక్ష్మి. ఇక పుస్తకంలోకి వెళితే.. సంఘటనను సంఘటనగా కాకుండా విభిన్నకోణంలో ఎలా విశ్లేషించాలో 'ఆస్కార్ మైకం'లో తెలియచెప్పారు. 'స్లమ్‌డాగ్ మిలియనీర్' సినిమాకి వచ్చిన ఆస్కార్‌లకు 'జయహో' అంటూ కీర్తించాలా? అంటూ మనలో ప్రశ్నను రేకెత్తించి విశ్లేషించిన తీరు మెచ్చుకుని తీరాలి. 'స్వార్థలింగరాజు' అంటూ టైటిల్ పెట్టడమే సత్యం రాజులోని సత్యమెంతో చెప్పారు. 'అమ్మకు జేజే!' అంటూ 'అమ్మ' గురించి ఎంత చక్కగా చెప్పారో.. అదే మోతాదులో పైత్యం ఉన్న వారికి వాతలు కూడా పెట్టారు. ఇలా 44 అంశాలు ఈ పుస్తకంలో పొందుపరిచారు. 'అద్దంలో మనం' శీర్షికన ఆంధ్రభూమి వారపత్రికలో ఆరేళ్లుగా అప్రతిహతంగా సాగిపోతోందంటే 'నిజదర్పణం' కాబట్టే అని ఎవరికైనా అనిపిస్తుంది. ప్రజల్లో ఈ వాగ్బాణాలకి ఎంతో ఆదరణ ఉండబట్టే రచయిత రెండవ సంపుటం కూడా ముద్రితమైంది. 'అద్దంలో మనం' శీర్షిక ఎంచుకోవడంలో రచయిత నిశిత దృష్టిని చెప్పకనే చెప్పినట్టైంది.

తెలిసిన సంగతులకే కొత్త కోణం, అద్దంలో మనం, రెండవ సంపుటం- ఎ.ఎస్.లక్ష్మి వెల: రూ.65, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అన్ని బ్రాంచీలు.

- శాంతిశ్రీ

మ్యాంగో డెజర్ట్



కావలసిన పదార్థాలు

మామిడి పండ్లు - 4
పాలు - 1 కప్పు
పంచదార - 2 టీ స్పూన్లు,
ఏలకుల పొడి - 1 టీ స్పూన్
పుదీనా ఆకులు - కొన్ని
మీగడ - ఒక కప్పు
(మిక్సీలో వేసి క్రీమ్‌గా చేసుకోవాలి)

తయారు చేసే విధానం

మామిడిపండ్లు పై తొక్కు తీసి చిన్న ముక్కలు కోసుకోవాలి. పాలను మరిగించి అందులో క్రీం, పంచదార, ఏలకుల పొడి, మామిడి ముక్కలు కలిపి కొన్ని నిమిషాలు ఉడికించాలి. ఉడికేటప్పుడే మామిడి ముక్కలను మెత్తగా చిదమాలి. మామిడి వాసన వచ్చేవరకు స్టవ్‌మీద వుంచి దించాలి. చల్లారిన తర్వాత ఫ్రిజ్‌లో పెట్టుకోవచ్చు. సర్వ్ చేసేముందు పుదీనా ఆకులను పైన చల్లుకుంటే చాలు. నోరూరించే మ్యాంగో డెజర్ట్ రెడీ.

మ్యాంగో ఫిర్నీ

కావలసిన పదార్థాలు

బియ్యం - 2 కప్పులు, మామిడి పండ్ల గుజ్జు - 1 కప్పు, పాలు - ఒక కప్పు
పంచదార - ఒక కప్పు, ఏలకుల పొడి - చిటికెడు, బాదం పప్పు - 1 టీ స్పూన్
పిస్తా పప్పు - 1 టీ స్పూన్

తయారు చేసే విధానం

బియ్యం కడిగి నానబెట్టాలి. నీళ్లు లేకుండా వడకట్టి కాసేపు ఆరబెట్టాలి. మిక్సీలో వేసి పిండి చెయ్యాలి. పాలు కాచి అందులో పంచదార కలపాలి. కొద్దిగా నీళ్లు పోసి అందులో బియ్యం పిండి వేసి కలుపుతూ ఉడకనివ్వాలి. మామిడి పండ్ల గుజ్జును అందులో కలిపి చిక్కగా అయ్యాక ఏలకుల పొడి వెయ్యాలి. చల్లారాక ఈ మిశ్రమాన్ని మరో పాత్రలో తీసుకుని బాదం, పిస్తా పప్పులతో అలంకరించి వడ్డించాలి.



మ్యాంగో కుల్ఫీ

కావలసిన పదార్థాలు

మామిడి పండు - 1, చిక్కటి పాలు - 1 కప్పు
పాలపొడి - పావుకప్పు , పంచదార - 3 టీ స్పూన్లు
ఏలకుల పొడి - పావు టీ స్పూన్
కుంకుమపువ్వు - కొద్దిగా, చెర్రీ ముక్కలు - 2 టీ స్పూన్లు

తయారు చేసే విధానం

మామిడిపండు పై తొక్కుతీసి చిన్న ముక్కలు కోసుకోవాలి. మామిడి ముక్కలు, పంచదార, పాలు, పాలపొడులను వెడల్పాటి పాన్‌లో వేసి కలుపుతూ దగ్గర అయ్యేంతవరకు మరిగించి దించాలి. అందులో ఏలకుల పొడి, కుంకుమపువ్వు వేసి బాగా కలపాలి. చల్లారిన తర్వాత గడ్డకట్టేంత వరకు ఫ్రిజ్‌లో పెట్టాలి. అంతే మ్యాంగో కుల్ఫీ రెడీ. ఈ మిశ్రమాన్ని కప్పుల్లో వేసుకుని పైన చెర్రీ ముక్కలు వేసుకుంటే చాలా బావుంటుంది.

మ్యాంగో లస్సీ

కావలసిన పదార్థాలు

పెరుగు - పావులీటరు
మామిడి పండ్ల గుజ్జు - 1 కప్పు
పంచదార - ముప్పావు కప్పు
ఏలకుల పొడి - చిటికెడు
తేనె - 2 టీ స్పూన్లు
చల్లటి నీళ్లు - 1 కప్పు
మామిడి ముక్కలు - 2 టేబుల్ స్పూన్లు

తయారు చేసే విధానం

మిక్సీలో పెరుగు, మామిడి గుజ్జు, పంచదార, తేనె, ఏలకుల పొడి, చల్లని నీళ్లు పోసి బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని గ్లాస్‌లో పోసి ఐస్‌ముక్కలు, కొంచెం మామిడి ముక్కలు వేసి సర్వ్ చేయండి.



మ్యాంగో మిల్క్‌షేక్

కావలసిన పదార్థాలు

మామిడిపండు - 1, చల్లని పాలు - పావులీటరు
పంచదార - సరిపడా(పండు తీపిని బట్టి)

తయారుచేసే విధానం

బంగినపల్లి మామిడిపండు తొక్కుతీసి ముక్కలు కోసుకోవాలి. వాటికి పంచదార జోడించి మిక్సీలో తిప్పుకోవాలి. ఆ గుజ్జుకు పాలు, ఐస్‌ముక్కలు కలిపి బాగా నురుగు వచ్చేవరకూ మిక్సీలో తిప్పుకోవాలి. తరువాత చూడచక్కని గాజుగ్లాసులో వేసిస్తే పిల్లలు క్షణాల్లో జుర్రేస్తారు. దీన్ని మరింత ప్రత్యేకంగా మార్చాలనుకుంటే పైన వెనిల్లా లేక మ్యాంగో ఐస్‌క్రీమ్ ఒక స్కూప్ జతచేస్తే చాలు! చవులూరించే రుచి... చల్లదనపు హాయి!





చూద్దామా

నేషనల్ మ్యూజియం ఆఫ్ ది యునైటెడ్ ఎయిర్‌ఫోర్స్

రైట్ సోదరులు

న్యూజెర్సీ పట్టణం

న్యూయార్క్‌లో విహార యాత్ర

- రావెల సాంబశివరావు

విమానాల్లో కొద్ది దూరాల ప్రయాణం కొంచెం కష్టంగానే అనిపించింది. బంధువుల దగ్గరకి తిరగడం, మధ్య మధ్యలో కొత్త ప్రదేశాలు చూడడం ... ఇలా గడిచిపోయింది. ఎన్నో ఏళ్లుగా చేయాలనుకున్న రైలు ప్రయాణం కోరిక కూడా తీరింది. రైట్‌బ్రదర్స్ విమానం కనుగొనే ప్రయత్నంలో చేసిన ప్రయోగశాల చూడడం, ఎయిర్ పోర్టుల్లో పడిగాపులు... మా అమెరికా ప్రయాణం ఇలా ముగిసింది.

కొలంబస్ నుండి పోర్ట్‌వైన్‌కు బయలుదేరి మధ్యలో డేటన్‌లో విమాన ప్రదర్శనశాలను తిలికించాం. ఒహాయ్ రాష్ట్రంలోని డేటన్... రైట్ సోదరులు విమానాన్ని మొదట నిర్మించిన కార్యక్షేత్రం ఇది. వారి స్మృత్యర్థం నిర్మించిన వాయుతలంపై మనిషి విజయానికి గుర్తుగా నిర్మించిన ఈ ప్రదర్శన శాలల సముదాయం వారి కీర్తిని శాశ్వతం చేసింది. అక్కడ చూడదగినవి పదమూడు వున్నా ఐదారింటిని మాత్రమే చూడ్డానికి వీలుపడింది.

రైట్ సోదరులు 1890–1895 మధ్య కాలంలో ఇక్కడ ఒక బ్లాక్‌లోని ముద్రణాలయంలో పని చేసేవాళ్లు. వాళ్లతోపాటు పాల్ లారెన్స్ డన్‌బర్ అనే మిత్రుడు కూడా భాగస్వామిగా ఉండేవాడు. తరువాత ఆయన రంగుజాతికి చెందిన కవిగా అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించాడు. వారి స్నేహానికి గుర్తుగా ఆ భాగానికి రైట్-డన్‌బర్ ఇంటర్‌ప్రెటివ్ సెంటర్‌గా దాన్ని తీర్చిదిద్దటం సముచితమే అనిపించింది. అందులో పారాచ్యూట్ విభాగం సందర్శకులను బాగా ఆకట్టుకుంటుంది. తొలి ప్రపంచ యుద్ధానంతరం పారాచ్యూట్లు సురక్షితంగా దిగేందుకు అక్కడ అనేక ప్రయోగాలు జరిగాయి. వాటికి సంబంధించిన చిత్రాలను, సమాచారాన్ని, నమూనాలను అక్కడ ప్రదర్శించారు. పక్కనే రైట్ సోదరులు 1895–1897 మధ్య కాలంలో సైకిళ్ల తయారీకి వాడిన యంత్రాలు, వాళ్ల తయారు చేసిన సైకిళ్ల నమూనాలు కూడా వున్నాయి.

తర్వాత నేషనల్ మ్యూజియం ఆఫ్ ది యునైటెడ్ ఎయిర్‌ఫోర్స్‌కి వెళ్లాం. ఇది ప్రపంచంలోకెల్లా అతి పెద్ద, అతిపురాతన విమానాల ప్రదర్శనశాలగా గుర్తింపు పొందింది. ఇందులో దాదాపు 400 రకాల విమానాలున్నాయి. దీనికి ఒకమైలు దూరంలో ప్రెసిడెన్షియల్ ఎయిర్ క్రాఫ్ట్ అండ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఉంది. ఇందులో అమెరికా దేశాధ్యక్షులు వాడిన తొమ్మిది విమానాలను ప్రదర్శనకు ఉంచారు. ఇవి సందర్శకులను ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాయి. వాటిల్లోకి సందర్శకులు ఎక్కి చూడొచ్చు. మూడు, నాలుగు గంటలు రకరకాల విమానాలను, యుద్ధ విమానాలను, అవి బాంబులను జారవిడిచే పద్ధతిని, హీరోషిమా నాగసాకిపై అణుబాంబు విసిరి వేలాదిమంది అమాయకుల ప్రాణాలను పొట్టన పెట్టుకున్న విమానాన్నీ చూశాం. ప్రచ్ఛన్న యుద్ధానికి సంబంధించిన విషయాలను అవగాహన చేసుకోడానికి ఇది చాలా ఉపయోగపడుతుందనిపించింది.

సాయంత్రం 5 గంటల ప్రాంతంలో డా॥ పి.ఆర్. గుమ్మడి ఇంటికి చేరుకున్నాం. ఆయన ప్రఖ్యాత సినీనటులు గుమ్మడి వెంకటేశ్వరరావుగారి చివరి తమ్ముడు. మా అత్తగారు వారి సమిష్టి కుటుంబపు ఆడపడుచు. ఆ బంధుత్వం రీత్యా అక్కడకు వెళ్లాం. డా॥పి.ఆర్. గుమ్మడి సతీసమేతంగా నౌకాయానానికి వెళ్లారు. ఆ రాత్రి 11 గంటలకు తిరిగి వచ్చారు. ఇల్లు కొంచెం రిచ్‌గా కన్పించింది. రకరకాల చిత్తరువులు, పింగాణీ బొమ్మలు క్రిష్టల్ బొమ్మలున్నాయి. డా॥ గుమ్మడి గారితో చాలా దగ్గరగా గోల్ఫ్ (వాళ్లు గాల్ప్ అంటారు) ఆటను చూచే అవకాశం లభించింది. భరత్, శరత్‌ల దగ్గర తప్ప ఎక్కడా రెండు రోజులకు మించి వున్నది లేదు. నా భార్య తన పిన్నితోను, కజిన్ రత్నకుమారితో కబుర్లు చెబుతూ నాలుగైదు రోజులు గడిపేసింది. నాకు ఇక్కడ ఆంధ్రప్రదేలో ఉన్నట్లే అనిపించింది. బాగా రుచిగా వుండటం వల్ల భోజనం కూడా మోతాదుకు మించి చేశాను. మరి వాళ్లకు ఏపాటి అసౌకర్యాన్ని కల్గించివుంటామో తెలియదు. కానీ, చేతి గడియారం ఖరీదైనది బహూకరించబోతుంటే వద్దన్నాను. అయినా వినకపోతే నా భార్య దానికి బదులుగా కారులోకి ఎంటర్‌టైన్‌మెంట్ సిస్టమ్ తీసుకుంది. అలా ఆతిథ్యపు బరువులు మోస్తున్న మమ్మల్ని భరత్ వచ్చి తన కారులో తిరిగి పియోరియాకు చేర్చాడు. దారిలో పోర్ట్‌వైన్‌లో వాళ్లింట్లో కూరగాయల, పూల మొక్కల పెంపకం పట్ల చూపే శ్రద్ధ గురించి మాట్లాడుకున్నాం. ఐదు గంటలు ప్రయాణం చేసి పియోరియా చేరుకున్నాం.

అలా నేను దాదాపు ఒక మూడు వారాల పాటు పియోరియాకు దూరంగా వున్నాను. మళ్లీ వీకెండుకు కారులో 8 గంటలు ప్రయాణం చేసి కెన్సాస్ స్టేట్ యూనివర్శిటీలో పని చేసే ప్రొఫెసర్ కృష్ణకుమార్ గారిని పరామర్శించి ఆ రాత్రికి అక్కడ వుండి మరుసటిరోజు తిరిగి పియోరియాకు వచ్చేశాం.

ఈసారి వారాంతాలు (ఆగస్టు 13 నుండి 15 వరకు) న్యూయార్క్ న్యూజెర్సీలలో గడపాలనుకున్నాం. అమెరికాలో విమాన ప్రయాణాల్లో జాప్యం జరిగితే అందుకు ప్రతిఫలాన్ని ప్రయాణీకులకు ఇస్తారని, రాత్రి సమయాల్లో అయితే హోటళ్లకు తరలిస్తారనే మాటల్ని గతంలో విన్నాను. అదంతా ఇప్పుడు లేదని మా ప్రయాణంలో

తెలిసింది. అంతకుముందు నేను ఒక్కణ్ణే న్యూయార్క్ వెళ్లాను. ఈ పర్యాయం ప్రయాణం డెల్టా కంపెనీ వారి విమానాల్లో పియోరియా నుండి డెట్రాయిట్‌కు వెళ్లే విమానం ఓ గంట ఆలస్యంగా నడిచింది. అయినా వాళ్లేమీ కాంపెన్‌సేషన్ ఇవ్వలేదు. పోనీ మరో విమానం ఎక్కేలోపు పడిగాపులు తప్పాయి అనుకున్నాం. అయితే ఆ ఆనందమూ ఆవిరైపోయింది. నెవార్క్ వెళ్లే విమానం ఎక్కి కూర్చున్నాం. నడుముకు సీటు బెల్టులు బిగించాం. అంతలో మరో ప్రకటన. ఆ విమానానికి కొద్దిపాటి సాంకేతిక లోపం వున్నదని, అందువలన దానిని సరిచేసే వరకు లాంజ్‌లో కూర్చోమన్నారు. రెండు గంటలు గడిచినా అది ఎప్పుడు బయలుదేరుతున్నదో ఖచ్చితంగా ఎవరూ చెప్పలేకపోయారు. ఇంతలో రాత్రి గం. 9.30 ని.లకు వాళ్ల విమానమే మరొకటి వేరే టెర్మినల్ నుండి బయలుదేరుతుందని తెలిసింది. అప్పటికి ఇరవై నిముషాలు మాత్రమే వుంది. ఆ విమానం బయలు దేరేందుకు ఈ టెర్మినల్ నుండి ఆ టెర్మినల్‌కు దాదాపు ఒక కిలోమీటరు పైనే వుంటుంది. శ్రీమతికి వీల్ ఛైర్ ఏర్పాటు చేశాం. వీల్ ఛైర్ వెంట మేము పరుగెత్తవలసి వచ్చింది. ఒక దశలోనైతే ఆయాసం ఎక్కువై అక్కడే పడిపోతానేమో అన్పించింది. ఇంతలో ఆ విమానం దగ్గరకు చేరుకున్నాం. అదెక్కి న్యూజెర్సీలోని విమానాశ్రయానికిచేరి అక్కడ నివాసముంటున్న సాయిగారింటికి చేరుకునేప్పటికి రాత్రి 12 దాటింది.

మరుసటి రోజు ఉదయం సాయివాళ్ల పాప తన సంగీతం కమ్మగా విన్పించింది. వినాయకుడి ప్రార్థన కర్నాటక బాణీలో గాత్ర సంగీతంగానూ, మరో పాశ్చాత్య సంగీత గీతాన్ని పియానోమీద విన్పించింది. ఆ చిన్నారి ప్రాచ్య, పాశ్చాత్య సంగీతాలకు అలా వారధి కట్టడం ముదావహం. ఆ అమ్మాయి పియానో వాయించటం చూస్తుంటే ఇరవైయేళ్ల క్రితం మా మరదలు కూతరు తన పియానో సరిగ్గా పలకకపోతుంటే "ఇంట్లో వాళ్లంతా నా పియానోని పాడుచేశారు" అన్న మాటలు గుర్తొచ్చి నవ్వుకున్నాం.

సంగీత కచేరి తరువాత న్యూజెర్సీ నుండి న్యూయార్క్‌కు బయలుదేరాం. మెన్హటన్ స్టేషన్ నుండి న్యూయార్క్‌కు రైల్లో వెళ్లాం. దాంతో అమెరికాలో రైలు ప్రయాణం చేయాలనే నా మోజు తీరింది. రైలు బాగానే వుంది. సీట్లు, ఏ.సీ. బోగీలు... తిరిగి వచ్చేప్పుడు డబుల్ డెక్కర్ రైలు ఎక్కాం. స్టేషన్లు మాత్రం అంత బాగా లేవు. చిన్న చిన్న స్టేషన్లలో సిగ్నల్స్ వుండవు. స్టేషన్ మాష్టర్లుండరు, టిక్కెట్లు యంత్రాలే అమ్ముతాయి. జంక్షన్లలో మాత్రం సిగ్నలింగ్ సిస్టమ్ వుంది.

నా శ్రీమతి వేక్స్ మ్యూజియంలోని బొమ్మల్ని చూసి ఉబ్బితబ్బిబ్బయ్యింది. ఓ రెండు గంటల పాటు తిరిగి చూశాం. 4డి సినిమా చూడటం ఒక వింత అనుభవం. తరువాత ఒక ఇండియన్ రెస్టారెంట్‌లో భోజనం ముగించుకొని పట్టణమంతా తిప్పి చూపెట్టే బస్సులో న్యూయార్క్ అంతా తిరిగి చూశాం. మళ్లీ రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో రమ్య వాళ్లింటికి చేరుకునేప్పటికి వాళ్ల అమ్మాయి అన్న ప్రాసన కార్యక్రమం అప్పుడే మొదలయ్యింది. సమయానికి చేరుకొన్నందుకు వాళ్లు సంతోషించారు.

మరుసటి రోజు ఉదయం మా చెల్లెలు అరుణ వాళ్ల ఇంటి వద్ద బ్రేక్‌ఫాస్టు. తరువాత వాసిరెడ్డి విజయకుమార్ దంపతులు ఏర్పాటు చేసిన ఓణీల వేడుకను తిలకించాం. చాలా విలాసవంతమైన హోటల్లో కడు వైభవంగా, కన్నుల పండుగగా జరిపారు. ఆ అమ్మాయి ఒక దేవకన్యలా భావించుకునేట్లు జరిగిందా వేడుక. తిరిగి ఆ అమ్మాయి ఈలోకంలోకి వచ్చేందుకు ఎంత కాలం పడుతుందో అనిపించింది.

తిరిగి పియోరియా చేరుకున్నాం. చిన్న విమానాల ప్రయాణం ఇబ్బందికరంగానే వుంది. క్షణం తీరికలేకుండా తిరగటం వల్ల ఒళ్లునొప్పులు అనిపించింది. బసవపున్నమ్మగారికి దగ్గు పడిశం. అప్పటికింకా మా తిరుగు ప్రయాణానికి పదమూడు రోజులే వుంది. ఎక్కడికీ వెళ్లకుండా పియోరియాలోనే వున్నాం. పెద్ద బసవపున్నమ్మగారు కుమార్తెతో వచ్చి ఒక నాల్గురోజులుండి వెళ్లారు. మా మరదలు కూతరు, అల్లుడు (కవిత-లాయరు, విశాల్ మెడికో) వస్తామని ఊరించారుగాని వాళ్ల కుక్కకు జబ్బు చేయటంతో ఆగిపోయారు. భరత్ మిత్రులు కొందరి ఇళ్లకు మేమెళ్లటం, వాళ్లు, భరత్ ఇంటికి రావటం జరిగింది.

పెద్ద బసవపున్నమ్మగారు పియోరియా వస్తామన్న సమయం కంటే రెండు రోజులు ఆలస్యంగా వచ్చారు. దానికి వెనుక ఓ పెద్ద గాథ. అది వాళ్ల ఇంటి ఆవరణంలో చెట్టుకొట్టేసిన ప్రభుత్వం, తీర్పు చెప్పిన న్యాయస్థానం, గృహ యజమానికి అన్యాయం జరిగిందన్న పత్రికలు. ఆ ఉదంతం నన్నొక గేయం రాసేట్లుగా చేసింది.

తిరుగు ప్రయాణంలో చికాగోలోని మిత్రుని కుమారుని ఇంటికి వెళ్లాం. మేము గుడివాళ్లం కాదు, బడివాళ్లం అని తెలిసినా మమ్మల్ని అక్కడి రెండు ప్రసిద్ధ దేవాలయాలకు తీసుకెళ్లాడు ఆ లోకం సురేష్. ఒకటి వెంకటేశ్వర స్వామిది. అది చూడ్డానికి తిరుమల తిరుపతిలో గర్భగుడిలా ఉంది. వేరొకటి ఉత్తర హిందూ స్థానపు దేవళపు చిత్రకళా రీతిలో చెక్కిన దేవళము. ఉత్తర భారతదేశపు దేవళ నిర్మాణం ఇసుక రాతి ఫలకాలను చెక్కి నిర్మిస్తారు. ఇక్కడ మాత్రం చెక్కతో చేసిన శిల్పాలు కనిపించాయి. రెండు దేవళాలు సిరిసంపదలతో తులతూగటమే కాకుండా చుట్టూ చక్కటి పచ్చిక బయళ్లతో శిల్పకళా రమణీయతతో విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్నాయి. భక్తులుగా కాకపోయినా యాత్రికులుగా ఆ దేవళాలను చూడొచ్చు అనిపించింది. ఆ దేవళాలలో ఒక దానిపై ఆంధ్రుల పెత్తనం. మరొకదానిపై గుజరాతీయుల పెత్తనం ఉందట.

సాయంత్రం చికాగో విమానాశ్రయంలో భరత్ వీడ్కోలు పలికాడు. తిరిగి వచ్చేనాటికి బయలుదేరిన నాటి బెరుకుపోయింది. విమానాల్లోనూ, లాంజ్‌ల్లోనూ మునుపటికంటే ఫ్రీగా వున్నాం. భోజనం ఆర్డర్ చేయటం బాగా తెలిసింది. ఆగస్టు 28, 4 గంటలకు బయలుదేరిన వాళ్లం 29 సాయంత్రం 3 గంటలకు చేరుకోవాలి గాని మేము చేరింది మాత్రం 30వ తేదీ తెల్లవారు జామున 3 గంటలకు. మేము వెళ్లేప్పుడు కోల్పోయిన సమయాన్ని తిరిగి ఆ విధంగా పొందగలిగాం.

హైదరాబాద్‌లో రెండు మాసాల క్రితం వీడ్కోలు పలికిన మా అబ్బాయి ఇప్పుడు వాళ్లబ్బాయితో వచ్చి స్వాగతం పలకటంతో మా రెండు మాసాల అమెరికా పర్యటన ముగిసింది.

★



న్యూయార్క్‌లో డబుల్ డెక్కర్ రైలులో ప్రయాణం...

చికాగోలోని ఓ దేవాలయం...

అట్టమీది కథ



అతనో పెద్ద ఉగ్రవాద సంస్థ నాయకుడు. అతగాణ్ణి పట్టుకోలేకపోయినందుకు నాటి అమెరికా అధ్యక్షుడు జూనియర్ బుష్ తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నాడు. చివరికి సంజాయిషీలు ఇచ్చుకోలేక అతగాణ్ణి హతమార్చినట్లు అవాస్తవ ప్రకటనలు చేయించటంతో పాటు చిత్రాలను కూడా విడుదల చేయించాడు. ఇప్పటి అధ్యక్షుడు ఒబామా రెండవసారి ఒసామాను మట్టుబెట్టినట్లు ప్రకటించాడు. అతగాడి ఫొటోలేవంటే బయట పెట్టనుగాక పెట్టనని భీష్మించుకున్నాడు. నాడు లాడెన్‌ను ఎందుకు చంపలేదని అమెరికన్లు నిలదీస్తే ఇప్పుడు చంపి ప్రజాస్వామిక వాదులకు సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన స్థితిలో పడింది అమెరికా. ఇంతకీ అతడెవరో ఈ పాటికి తెలిసే ఉంటుంది. అమెరికా మేథస్సుతో పాకిస్థాన్ పెంచి పోషించిన ఒసామా బిన్ లాడెన్. ఉగ్రవాద, మతోన్మాద చరిత్రను చూస్తే దారితప్పిన ఈ శక్తుల నాయకులను హతమార్చినంత మాత్రాన ఉగ్రవాదం, మతోన్మాదం ఎక్కడా అంతం కాలేదు. కొత్త వారు పుట్టుకు వస్తూనే ఉన్నారు. ఇప్పటివరకు ఒసామా ఎప్పుడు దాడి చేస్తాడో తెలియని భయంతో ఉన్న అమెరికన్లు ఇప్పుడు ఎందరు ఒసామాలు ఎక్కడ దాడి చేస్తారో తెలియని ఆందోళనకు గురవుతున్నారు. తమకు తెలియకుండానే అమెరికన్ సేనలు దాడి చేశాయని పాకిస్థాన్ ప్రకటించింది. ఒక వేళ ఒసామా పాక్‌లో ఉన్నట్లు తేలితే పాకిస్థాన్‌కు తెలుపకుండానే దాడి చేసి పట్టుకొనేందుకు అమెరికాకు అవకాశమిస్తూ పదేళ్ల క్రితమే రెండు దేశాల మధ్య రహస్య ఒప్పందం జరిగిందని తాజాగా వెల్లడి కావటంతో వివాదం మరో మలుపు తిరిగింది. అసలు ఈ ఒసామా ఎవరు? అమెరికా ఎందుకు పెంచి పోషించింది? తర్వాత తనే ఎందుకు అంతం చేసింది? అందుకు చెల్లించిన మూల్యం ఎంత? అసలు ఒసామాను చంపేందుకు అమెరికా అదివరకే పాక్‌తో ఒప్పందం కుదుర్చుకుందా? వంటి అనేకానేక ప్రశ్నలకు సమాధానాలు... ఈ వారం అట్టమీది కథలో ...

ఒక ఒసామా వంద ప్రశ్నలు

- ఎం.కోటేశ్వరరావు

ప్రపంచానికి పరిచితమైన ఒసామా బిన్ లాడెన్ పూర్తి పేరు ఒసామా బిన్ మహమ్మద్ బిన్ అవద్ బిన్ లాడెన్. సౌదీ అరేబియాలోని రియాద్‌లో ఒక ధనిక కుటుంబ యజమాని పదవ భార్య సంతానం లాడెన్. తన పుట్టిన రోజును మార్చి 10, 1957గా లాడెన్ ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు. లాడెన్ పుట్టిన తరువాత తండ్రి మహమ్మద్ అనుచరుడు అల్ అత్తాస్‌ను లాడెన్ తల్లి వివాహం చేసుకుంది. వారికి నలుగురు పిల్లలు. లాడెన్ వారితోనే కలిసి ఉన్నాడు. విశ్వవిద్యాలయంలో చదువుతూ మధ్యలోనే జీహాద్ (పవిత్ర యుద్ధం) పేరుతో చదువును [illegible]డని చెబుతారు. పది హేడవ ఏట తొలి నిఖా చేసుకున్న లాడెన్ మొత్తం ఆరుగురిని వివాహం చేసుకున్నట్లు చెబుతారు. వారికి 20 నుంచి 26 మంది పిల్లలు కలిగారు. ఎక్కువ మంది ఇరాన్‌కు పారిపోయారని అంటారు.

1979లో కాలేజీని వదలి పెట్టిన లాడెన్ పాకిస్థాన్ చేరుకున్నాడు. సోవియట్‌కు వ్యతిరేకంగా అప్పటికే అమెరికా సాయంతో పాక్ ఐ.ఎస్.ఐ శిక్షణతో పనిచేస్తున్న అబ్దుల్లా అజీమ్ ముజాహిదిన్ బృందంతో చేరాడు. క్రమంగా 1984లో అజామ్‌తో కలిసి కొత్త బృందాన్ని ఏర్పాటు చేశాడు. పాక్ గడ్డపై తాలిబాన్లకు తానే శిక్షణ ఇచ్చాడు. నాలుగేళ్ల తరువాత ముజాహిదీన్లకు సాయం చేయటమేమిటి ఇస్లామిక్ పాలన ఏర్పాటుకు వారితో కలిసి పోవాలంటూ లాడెన్ ఆల్ ఖైదా సంస్థను ఏర్పాటు చేశాడు. 1989లో సోవియట్ సేనలు ఆఫ్ఘనిస్తాన్ వదలి వెళ్లిన తరువాత జీహాద్ హీరోగా సౌదీకి వచ్చాడు. 1990లో సద్దామ్ హుస్సేన్ కువైట్‌పై దాడి చేసిన తరువాత సౌదీ అరేబియా తనకు కూడా ప్రమాదం వచ్చినట్లు భావించి అమెరికా సాయం కోరింది. ఆ సమయంలో సౌదీరాజు, ఇతర మంత్రులను కలిసిన లాడెన్ అమెరికా తదితర ముస్లిమేతరులపై ఆధారపడకుండా మనల్ని మనమే రక్షించుకోవాలని, అవసరమైతే తాను శిక్షణ ఇచ్చిన దళాలను రంగంలోకి దింపుతానని ప్రతిపాదించాడు. దానిని తిరస్కరించి సౌదీ రాజు అమెరికన్ సేనలకు స్వాగతం పలికాడు. ఆ చర్యను లాడెన్ బహిరంగంగా విమర్శించటంతో ప్రభుత్వం అతని నోరు మూయించేందుకు ప్రయత్నించింది. దానిలో భాగంగానే 1990 నవంబరులో అమెరికా న్యూజెర్సీలోని లాడెన్ అనుచరుడి కార్యాలయంపై పోలీసులు దాడి చేశారు. సౌదీలో ఉండటం ఇబ్బందిగా మారటంతో 1992లో సూడాన్ వెళ్లాడు. అక్కడ వ్యాపారంతో పాటు సౌదీపై విమర్శలు చేయటంతో సౌదీ సర్కార్ సూడాన్‌పై వత్తిడి తెచ్చి పాస్‌పోర్టు రద్దుకు ప్రయత్నించింది. దాంతో లాడెన్ ఈజిప్టు జీహాదీ శక్తులకు దగ్గరయ్యాడు. ఆ సంస్థ అమెరికాకు సన్నిహితంగా ఉన్న ఈజిప్టు అధ్యక్షుడు హోస్నీ ముబారక్‌పై 1995లో హత్యాయత్నం జరిపింది. లాడెన్ తొలి దాడి 1992లో ఎమెన్‌లోని అమెరికన్ సైనికులున్న హోటల్‌పై జరిపినట్లుగా చెబుతారు. తరువాత 1998లో కెన్యా, టాంజానియాలోని అమెరికా

రాయబార కార్యాలయాలపై దాడులు జరిపాడు. 1999 వరకు ఆల్ ఖైదాను ఒక ఉగ్రవాద సంస్థగా అమెరికా పరిగణించలేదు. తరువాత 2001 సెప్టెంబరు 11న న్యూయార్క్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రంపై దాడితో లాడెన్ మరింత పేరు మోశాడు. అప్పటి నుంచి అతణ్ణి పట్టుకోవటానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నించింది.

దాడి ఎలా జరిగింది?

'నేవీ సీల్స్' పేరుతో ఉన్న నలభై మంది కమాండోలు ఏప్రిల్ 29 రాత్రి నాలుగు హెలికాప్టర్లతో ఆఫ్ఘనిస్తాన్ నుంచి బయలుదేరి పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌కు 56 కిలోమీటర్ల దూరంలో ఉన్న అబొత్తాబాద్‌లోని లాడెన్ నివాసంపై దాడి చేశారు. మొత్తం 40 నిమిషాల్లో తమ పని కానిచ్చారు. లాడెన్‌కు నమ్మిన బంటు పేరును 2007లో గుర్తించిన అమెరికన్లు 2009లో లాడెన్ అబొత్తాబాద్‌లో ఉంటున్నట్లు తెలుసుకున్నారు. రెండేళ్ల తరువాత దాడి చేశారు. ఒసామాపై దాడి విషయంలో అమెరికా జాతీయ భద్రతా కౌన్సిల్‌లో భిన్నాభిప్రాయాలు తలెత్తినట్లు అధ్యక్షుడు ఒబామా స్వయంగా ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు. అబొత్తాబాద్‌లో ఒసామా ఉంటాడనే ఒక అంచనా తప్ప సాక్ష్యాధారంగా ఒక్క ఫొటో లేదా ఆ భవనంలో మనుషులున్నారనే ఆచూకీ కూడా దాడికి ముందు అమెరికా వద్ద లేదు. అందువలన తీరా 'నేవీ సీల్స్' దాడిలో సెప్టెంబరు 11,2001 దాడులకు పాల్పడ్డ ఉగ్రవాద నాయకుడికి బదులు 'దుబాయ్ నుంచి వచ్చిన ఒక ధనికుడు' మాత్రమే దొరుకుతాడేమోనని, ఒక వేళ లాడెన్ లేకపోతే కొన్ని పర్యవసానాలు ఎదురవుతాయని తనకూ అనిపించిందని ఒబామా చెప్పుకున్నాడు. పాక్ భూభాగంలోకి పెద్ద సంఖ్యలో దళాలను పంపటం ముప్పు తెస్తుందేమో అన్న సలహాదారుల హెచ్చరికలను తిరస్కరించానని పథకాన్ని అమలు జరపటమే మేలనే నిర్ధారణకు వచ్చినట్లు చెప్పాడు. లాడెన్‌పై దాడికి వెళ్లినపుడు ఒక వేళ స్థానిక

పోలీసులు, పాక్ సైన్యం, అడ్డుకుంటే వారందరినీ తిప్పికొట్టేందుకు అవసరమైన భారీ సంఖ్యలో కమాండోలను తరలించాలని ఒబామా ఆదేశించాడని పెంటగన్ అధికారులు వెల్లడించారు. అంటే లాడెన్ గురించి పాకిస్థాన్‌కు పూర్తిగా తెలుసునని, ప్రతిఘటించే అవకాశం కూడా ఉండవచ్చన్నది అమెరికన్ల అంచనాగా స్పష్టం అవుతున్నది. అమెరికన్ నేవీ సీల్స్ (యుద్ధ కమాండోలు)తో నిండి ఉన్న హెలికాప్టర్లు తమ దేశంలో గుర్తు తెలియని ప్రాంతానికి బయలు దేరినట్లు ఇస్లామాబాద్‌లోని అధికారులకు తెలుసు. అయితే అది అబొత్తాబాద్ అని తెలియదని వారు చెబుతున్నారు. ఎంతో ప్రమాదంతో కూడుకున్న సిఐఎ, ప్రత్యేక దళాల చర్యకు ప్రతిఘటన ఎదురైతే ప్రతిదాడులు జరిపేందుకు అవసరమైన అనుమతులను కూడా ఒబామా సర్కార్ మంజూరు చేసింది. పాకిస్తానీయులను కూడా ఈ దాడిలో వినియోగించాలన్న సూచనను అమెరికా ఉన్నతాధికారులు తిరస్కరించారు. ముందు రూపొందించిన పథకం ప్రకారం రెండు హెలికాప్టర్లు బిన్‌లాడెన్ ఉన్న ప్రాంతానికి గంటన్నరలో చేరే విధంగా ఆఫ్ఘన్ సరిహద్దుల్లో సిద్ధంగా ఉండాలి. దాడికి పదిరోజుల ముందు ఒబామా సమీక్షించి మరో రెండింటిని ఉపయోగించాలని సూచించాడు. దాడికి రెండు బృందాలను ఏర్పాటు చేశారు. ఒకటి దాడిలో లాడెన్ చస్తే వెంటనే పోస్టుమార్టం చేసేందుకు ఫోరెన్సిక్ వైద్యుల బృందం, సముద్రంలో పాతిపెట్టటానికి, సజీవంగా దొరికితే ప్రశ్నించేందుకు అనువాదకులు, లాయర్లు, సాయుధ బృందంతో మరొక దళాన్ని ఏర్పాటు చేశారు. రెండో బృందం ఉత్తర అరేబియా సముద్ర జలాల్లో తిష్టవేసిన విమాన వాహక యుద్ధనౌక 'కారల్ విన్‌సన్'లో బస చేసింది.

దాడి సమయంలో అమెరికా గూఢచార విమానం పాకిస్థాన్ పోలీసులు, మిలిటరీ ఎలా స్పందిస్తుంది, లాడెన్‌తో పాటు దొరికిన డాక్యుమెంట్లు, కంప్యూటర్లను దాడికి వెళ్లిన బృందం తీసుకు వస్తున్నదా లేదా అనే దానిపై ఒక కన్ను, ఎలాంటి సంభాషణలు చోటుచేసుకుంటున్నాయో వినేందుకు ఒక చెవితో చక్కర్లు కొట్టింది. ఒక వేళ పాక్ దళాలు దాడిని ప్రతిఘటిస్తే ఘర్షణను నివారించాలని, అలాంటి పరిస్థితే వస్తే పాక్‌సైనికాధికారులతో మాట్లాడేందుకు అమెరికన్ నేవీ ఛీఫ్ అడ్మిరల్ ముల్లెన్‌తో సహా ఇతర అధికారులు సిద్ధంగా ఉండాలని నిర్ణయించారు. లాడెన్‌పై దాడి చేసి సజీవంగా పట్టుకోవాలని అనుకున్నట్లు చెబుతున్నప్పటికీ అతణ్ణి చంపేందుకే మొత్తం పథకం మొగ్గు చూపింది. ఎందుకంటే పేలుడు పదార్థాలను తన వంటికి చుట్టుకుని ఉంటాడని అమెరికన్లు అంచనా వేశారు.

ఒసామా మూల్యం ఎంత?

ఆఫ్ఘనిస్తాన్‌లో ఏర్పడిన అభ్యుదయవాదుల, కమ్యూనిస్టులతో కూడిన ప్రభుత్వానికి సహకరించేందుకు వచ్చిన నాటి సోవియట్ దళాలకు వ్యతిరేకంగా ముస్లిం మతోన్మాదాన్ని

రెచ్చగొట్టేందుకు అమెరికన్లు సృష్టించిన వారే తాలిబాన్లు, ఆల్‌ఖైదా తీవ్రవాదులనే విషయం చరిత్రలో దాచినా దాగని సత్యం. అందుకు అమెరికా భారీ మొత్తాలనే ఖర్చు చేసింది. తీరా ఏకు మేకయినట్లుగా, హాలీవుడ్ సినిమాల్లో తాము సృష్టించిన విచిత్ర ప్రాణులే చివరకు తమకు ఎదురు తిరిగినట్లుగా లాడెన్ తయారయ్యాడు. న్యూయార్క్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రంపై అమెరికన్లు కలలో కూడా ఊహించని రీతిలో విమానాలతో దాడి చేయించాడు. అప్పటి నుంచి లాడెన్‌ను పట్టుకొనేందుకు అమెరికా నానా తంటాలు పడింది. ఎక్కడో ఆఫ్ఘన్ కొండగుహల్లో ఉంటాడనుకుంటే పాక్ రాజధాని ఇస్లామాబాద్‌కు 56 కిలోమీటర్ల దూరంలోని అబొత్తాబాద్‌లో అన్ని సౌకర్యాలున్న బంగ్లాలో ఉన్నాడు. ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక ప్రచురించిన ఒక వ్యాసంలో లాడెన్‌ను పట్టుకొనేందుకు అమెరికా గత పది సంవత్సరాలలో రెండులక్షల కోట్ల డాలర్లకు పైగా ఖర్చు చేసిందని, ఈ ఖర్చు చివరకు అక్కడ ఆర్థిక సంక్షోభానికి ఒక ప్రధాన కారణంగా మారిందని పేర్కొన్నారు. అసలు బిన్‌లాడెన్ అనే వాడే లేకపోతే ఆఫ్ఘన్, ఇరాక్ యుద్ధాలే ఉండేవి కావని అమెరికా పార్లమెంట్ పరిశోధనా సంస్థ పేర్కొన్నది. న్యూయార్క్ ప్రపంచ వాణిజ్య కేంద్రంపై దాడి తరువాత అమెరికాలోని విమానాశ్రయాల్లో భద్రతా ఏర్పాట్లను పెంచేందుకు, ప్రయాణాలు ఆలస్యమైతే అయ్యే పరోక్ష ఖర్చుతో సహా అమెరికాకు అదనంగా 417 బిలియన్ డాలర్ల చేతి చమురు వదిలింది. దాడుల తరువాత ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఒడుదుడుకులకు లోనై కోలుకున్న తరువాత కూడా అమెరికాలో వడ్డీ రేట్లను కృత్రిమంగా తగ్గించి ఉంచారు. ఈ చర్య కూడా అదనపు ఖర్చుకు దారి తీసింది.

లాడెన్‌ను హతమార్చి ఆల్ ఖైదా తలను నరికివేశామని అమెరికా అధ్యక్షుడు ఒబామా ప్రకటించాడు. లాడెన్ చచ్చాడు కనుక ఆఫ్ఘనిస్తాన్‌ను వదలి వెళ్లాలని కొన్ని అరబ్ రాజ్యాలు అమెరికాను డిమాండ్ చేశాయి. ఉగ్రవాదంపై పోరు అనేది అమెరికన్లకు ఒక సాకు మాత్రమే. అందుకే వెంటనే 'అబ్బె.. అబ్బె.. ఉగ్రవాదంపై పోరు అంటే... మేమెప్పుడూ ఒక వ్యక్తిపై కేంద్రీకరించలేదంటూ' అమెరికా భద్రతా అధ్యయన సంస్థ విశ్లేషకుడు కార్డ్‌మన్ చెప్పుకొచ్చాడు. అతని మరణానికి ముందున్న ప్రమాదాలన్నీ ఇప్పుడు కూడా ఉన్నాయని అన్నాడు. అలాంటపుడు అమెరికాయే నిత్యం చెప్పే మానవహక్కులను ఉల్లంఘించి నిరాయుధుడిగా ఉన్న లాడెన్‌ను చంపాల్సిన అవసరం ఏమి వచ్చింది?

ఉగ్రవాదుల ఏరివేతలో సముచిత స్థానంతో పాటు గత పది సంవత్సరాలలో పాకిస్థాన్‌కు 2000 కోట్ల డాలర్ల సాయంకూడా చేశామని, అలాంటి పాకిస్థాన్ చివరకు ఆ లాడెన్‌కే ఆశ్రయమిచ్చి నమ్మకద్రోహం చేసిందని అమెరికన్లు కొందరు మండిపడుతున్నారు. సంజాయిషీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రాజధానికి అత్యంత సమీపంలో, కీలకమైన మిలిటరీ అకాడమీలున్న ప్రాంతంలో ఆరు సంవత్సరాలుగా లాడెన్ నివాసం ఉంటున్నా తమకు తెలియదని పాకిస్థాన్ చెబితే నమ్మేందుకు తాము అమాయకులం కాదని అమెరికన్లు అంటున్నారు. అయితే పాక్‌తో సత్సంబంధాల అవసరం ఉన్నందున పాక్ వ్యతిరేక ప్రచారాన్ని అదుపు చేయాలని ఒబామా సర్కార్ నిర్ణయించింది. దానిలో భాగంగానే సెనెట్ విదేశీ సంబంధాల కమిటీ చైర్మన్ జాన్ ఎఫ్ కెరీ మాట్లాడుతూ దాడి పూర్తయ్యేవరకు పాక్ సర్కార్‌కు తెలియచేయకపోయినప్పటికీ లాడెన్‌ను పట్టుకొనేందుకు పాకిస్థాన్ తమకు ఎంతగానో సహకరించిందని వ్యాఖ్యానించాడు. మరోవైపున పాకిస్థాన్‌లో కూడా తమ ప్రభుత్వ, ఐఎస్ఐ, మిలిటరీ సహకారం లేకుండా ఒసామా ఇంతకాలం ఎలా ఉంటాడని ప్రయివేటుగా ప్రశ్నిస్తున్నవారు లేకపోలేదు.

అబొత్తాబాద్ ప్రాంతంలో పని చేసిన ఒక పోలీసు అధికారి మాట్లాడుతూ ఆ ప్రాంతానికి ఎవరైనా అపరిచితులు వస్తే ఎవడో గడ్డపోడు వచ్చాడని తమకు అనేక ఫోన్లు వచ్చేవని, వాటి ఆధారంగా తాము తనిఖీలు జరిపేవారమని, అయితే లాడెన్ ఉంటున్న భవంతిలో కనీసం 18 మంది నివసిస్తున్నా ఎవరికీ ఎలాంటి అనుమానం కలగకపోవటం ఆశ్చర్యంగా ఉందన్నారు. మూడు నెలల క్రితం తాము అబొత్తాబాద్‌లోని ప్రతి ఇంటినీ తనిఖీ చేశామని కుటుంబ యజమానుల ఫోటోలు, ఆస్తుల వివరాలు సేకరించామని అప్పుడు కూడా లాడెన్ సమాచారం లేదన్నారు. లాడెన్ నివాసం ఉంటున్న భవనం అర్షద్ ఖాన్ అనే వ్యక్తి పేరుతో ఉందన్నారు. జనాభా లెక్కల సేకరణకు గతనెలలో వెళ్లినపుడు రెండుసార్లు గేట్ తీయమని కోరినా స్పందన రాలేదని కూడా తెలిపారు.

దాడి తరువాత లాడెన్ ఉన్న విషయం మాకెందుకు చెప్పలేదని అమెరికా నిలదీయటంతో పాక్ సర్కార్ ఇబ్బందుల్లో పడింది. మూడు రోజుల తరువాత లాడెన్ వ్యవహారంలో తాము చూసీచూడనట్లు లేదా అసమర్థంగా వ్యవహరించామని విమర్శించటాన్ని ప్రధాని గిలానీ ఖండించారు. తాము లాడెన్ మరణాన్ని స్వాగతిస్తున్నప్పటికీ తమ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించే విధంగా వ్యవహరించటాన్ని సహించబోమని పాక్ పేర్కొంది. ఇదే సమయంలో అమెరికాతో సంబంధాలకు ప్రాధాన్యత ఇస్తామని ప్రధాని పేర్కొన్నారు. ప్రధాని, అధ్యక్షుడు రాజీనామా చేయాలని పాక్ ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దేశ సార్వభౌమత్వం, స్వాతంత్ర్యం, ఆత్మగౌరవానికిది పెద్ద దెబ్బ అని మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ ధ్వజమెత్తాడు. ప్రస్తుతం పాక్ బందీలుగా ఉన్న ముగ్గురు లాడెన్ భార్యలను ప్రశ్నించేందుకు అంగీకరించాలని పాక్ సర్కార్‌ను అమెరికన్లు డిమాండ్ చేస్తున్నారు. లాడెన్ భార్యలను విచారించేందుకు ముందు వారి మాతృదేశాలు తమ ప్రభుత్వానికి అనుమతివ్వాలని పాక్ గూఢచార అధికారి చెప్పటం గమనార్హం.ఒక భార్య ఎమెనీ అని తెలుసుగాని మిగిలిన ఇద్దరెవరో తెలియదన్నాడు.

రహస్య ఒప్పందం జరిగిందా?

పాకిస్థాన్‌లో లాడెన్ ఉన్నట్లు తేలితే పాక్ అధికారులకు తెలుపకుండానే అమెరికన్లు దాడి చేసి పట్టుకునేలా పదేళ్ల క్రితమే రెండు దేశాల మధ్య



కూలుతున్న ప్రపంచ వాణిజ్యకేంద్రాన్ని తిలకిస్తున్న అమెరికన్లు



ఆపరేషన్ లాడెన్‌ను తిలకిస్తున్న ఒబామా బృందం



రహస్య ఒప్పందం జరిగిందా? అన్న ప్రశ్నకు అవునని బ్రిటన్ పత్రిక గార్డియన్ వెల్లడించింది. జూనియర్ బుష్–ముషరఫ్ మధ్య అలాంటి ఒప్పందం ఉందని పాక్–అమెరికా అధికారులు చెప్పినట్లు తెలిపింది. మూడు సంవత్సరాల క్రితం దానిని తిరిగి పునరుద్ధరించినట్లు కూడా పాక్ అధికారి ఒకరు తెలిపారు. దానికి అనుగుణంగానే డ్రోన్స్ ద్వారా దాడులు చేస్తున్నట్లు వికీలీక్స్ పత్రాలు కూడా వెల్లడించాయి. నిజంగా ఉగ్రవాదులను పట్టుకుంటే అలాంటి దాడుల గురించి నేనేమీ లెక్క చేయను.అంతగా అయితే పార్లమెంట్‌లో నిరసన తెలుపుతాం తరువాత పట్టించుకోం అని గిలానీ అమెరికా అధికారితో చెప్పాడు. ఇప్పుడు లాడెన్‌పై దాడి విషయంలో గిలానీ చేస్తున్న విమర్శలు కూడా దానిలో భాగంగానే భావించాలా?

లాడెన్ మరణంపై అమెరికా చెప్పిన కథనాలు అనేక అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. ముందు లాడెన్ కాల్పులు జరిపాడన్నారు, తరువాత నిరాయుధుడిగా ఉన్నాడన్నారు. తన భార్యను అడ్డం పెట్టుకొని రక్షణ పొందేందుకు ప్రయత్నించాడని చెప్పారు. అదే నిజమైతే కాల్పుల్లో ఆమె ఎందుకు చనిపోలేదు? ఫొటోలు, వీడియో విడుదల చేస్తామని, అన్ని నిజాలు బయటకు వస్తాయని ముందు చెప్పారు. ఇప్పుడు కుదరదు పొమ్మంటున్నారు. ఫొటోలు విడుదల చేస్తే ప్రతిదాడులు జరుగుతాయని, రెచ్చగొట్టినట్లవుతుందని వాదనలు చేస్తున్నారు. ఒకసారి చెప్పిన కథనాన్ని మరోసారి చెప్పకుండా కొత్త విషయాలు చెప్పి ఒబామా సర్కార్ విస్వసనీయతను కోల్పోతున్నది. విదేశీయులను హతమార్చినపుడు ఫొటోలను విడుదల చేయటం తప్పనిసరి. దానిని నిరాకరించి ఒబామా ప్రమాదకరమైన అంకానికి తెరలేపాడని మైక్ రూపర్ట్ అనే మేధావి పేర్కొన్నారు.'తమ జీవితాలు సజావుగా సాగుతున్నపుడు జనం అబద్ధాలను కూడా నమ్ముతారు.అదే సరిగా లేకపోతే ప్రశ్నిస్తారు. జీవితాలు దిగజారినపుడు సమాధానాలకోసం చూడటమే కాదు, అనుమానాలు కూడా వ్యక్తం చేస్తారు. నిండుగా ఉన్న పెట్రోలియం కొలనులో ఈతకొడుతున్న ఒబామా అగ్గిపుల్లలను వెలిగిస్తున్నట్లుగా పరిస్థితి ఉంది.' అన్నారు. తక్షణమే ఆఫ్ఘనిస్తాన్ నుంచి సేనలను ఉపసంహరించకపోతే ప్రపంచం లాడెన్ గురించి మరింతగా ప్రశ్నిస్తుంది. అమెరికన్ల జీవితాలు రోజురోజుకు మరింత దిగజారతాయి. ప్రతిసారీ ఒబామా ప్రపంచ వాణిజ్య కేంద్రంపై దాడిని ప్రస్తావించారంటే మరింత పెట్రోలు పోసి అగ్గిపుల్లలను అడిగినట్లే.

లాడెన్‌ను హతమార్చినట్లు ఒబామా ప్రకటించగానే అమెరికా అంతటా సంబరాలు అంబరాన్నంటాయని మీడియా పేర్కొన్నది. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొన్ని ఉత్సవాలు తప్ప సామాన్య జనం అంతగా సంబరపడిందేమీ లేదు. లాడెన్ హత్యతో తమకు ఒరిగేదేమిటని వారు ఆలోచించారు. పథకం ప్రకారం చేసే హత్యలను అమెరికన్ సమాజం హర్షించదని కొందరు పేర్కొన్నారు. ఇలాంటి హత్యల్లో ప్రభుత్వమే పాల్గొంటే రాజకీయ పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని, ప్రజాస్వామిక, చట్టబద్ధమైన అంశాలను ఉల్లంఘించటంగా భావిస్తున్నారు. 1960 దశకంలో ఇలాంటి చట్టవిరుద్ధమైన చర్యలకు నిక్సన్ సర్కార్ నాంది పలికింది. హత్యలు అమెరికా సూత్రాలు, అంతర్జాతీయ వ్యవస్థకు విరుద్ధమైనవని 1976లో అమెరికన్ సెనెట్ కమిటీ నివేదిక స్పష్టం చేసింది. ఇలాంటి అభిశంసనలు గతంలో చేసిన కారణంగానే ఒబామా సర్కార్ తన చట్టవిరుద్ధ చర్యలను సమర్థించుకొనేందుకు ఎదురుదాడిలో ఒబామాను హతమార్చినట్లు ప్రకటించింది. అమెరికా విదేశాంగ విధానంలో హత్యలు ఎప్పుడు చట్టబద్ధమైనవిగా ఉంటాయో కూడా స్పష్టంగా పేర్కొన్నారు. యుద్ధ పరిస్థితుల్లో ఒసామా బిన్ లాడెన్ గనుక ఒక అమెరికా సైనికుడికి లొంగిపోయినపుడు అతన్ని కాల్చిచంపితే అది చట్ట విరుద్ధమౌతుంది. నిరాయుధుడిగా ఉన్న లాడెన్‌ను కాల్చిచంపటం సరిగ్గా అలాంటిదే అని ఒక నిపుణుడు పేర్కొన్నారు. 1988లో పాలస్తీనా విమోచనా సంస్థ (పి.ఎల్.ఓ) నాయకుడు అబూ జీహాద్‌ను హత్య చేయాలని ఇజ్రాయెల్ సర్కార్ ఆదేశించింది. ఉగ్రవాదిని చంపటం తప్పు కాదని తన చర్యను సమర్థించుకుంది (పి.ఎల్.ఓను ఉగ్రవాద సంస్థగా ఇజ్రాయెల్, అమెరికా పరిగణించిన విషయం తెలిసినదే). అప్పుడు న్యూయార్క్ పత్రిక వ్యాఖ్యాత టిమ్ వికర్ ఇజ్రాయెల్ చర్యను తీవ్రంగా విమర్శించాడు. ప్రజాస్వామిక, చట్టబద్ధతకు కట్టుబడిన ప్రభుత్వాలు హత్యలను ప్రోత్సహించటం నిబంధనలను ఉల్లంఘించటమే, దేశ ఉన్నతస్థాయి నాయకులు రాజకీయ హత్యలను సమర్థించటం తగని పని అని పేర్కొన్నాడు. ఇపుడు అదే పత్రిక లాడెన్ ఉగ్రవాది కనుక ఎలా చంపినా తప్పుకాదనే వాదనలను సమర్థిస్తూ ప్రచురించింది. ఇది ఒక్క ఆ పత్రికే కాదు మొత్తం అమెరికా మీడియా అంతా ఇలాంటి దుర్మార్గాలను ఎలాంటి వెరపు లేకుండా సమర్థిస్తోంది. ★

కథ

నోటు ఆత్మకథ

-కె.అరుణ

తల్లి గర్భంనుండి ఇప్పుడే బైటికి వచ్చిన పసిపాపలా ఉంది నా పరిస్థితి. లోకాన్ని నా కళ్లారా చూస్తూనే నన్ను నేను ఓసారి పరికించుకున్నాను. ఆ..హా! నాకు నేనే ముద్దొస్తున్నాను. ఈ మెరుపు, తాజాదనం, పరిమళం, ఎలాంటివారైనా సరే! ఇట్టే వ్యామోహంలో పడిపోవాల్సిందే! నాకున్న విలువ, గౌరవం అలాంటిది మరి!

కానీ ఈ చేతులేంటీ, నాలాంటివాళ్లను చాలామందిని చూశానన్నట్లు చూసీ చూడనట్లు పని చూసుకుంటున్నాడు. లెక్కలు మాత్రమే వేసుకుంటాడేమో! అదీ ఓ రకంగా నిజమే! నా ముందు, నా వెనుకా అంతా నాలాంటివాళ్లే ఉన్నారు. ఇక నేనెక్కడ ప్రత్యేకంగా కనిపిస్తాను. పైగా ఈయన ఉద్యోగంలో నాలాంటివాళ్లను ఎంతమందిని చూశాడో!

అరెరె! నా తోటివాళ్లతో విడదీస్తున్నాడే! సరి సరి! ఇదీ ఓ విధంగా మంచిదే! నన్ను చేతుల్లోకి తీసుకున్న వ్యక్తి కళ్లు నన్ను చూడగానే తళుక్కుమన్నాయి. ఆసాంతం కొత్త పెళ్లికూతుర్ని చూసినట్లు చూస్తున్నాడు. చెప్పొద్దూ! నాకూ గర్వంగానే అనిపించింది. కాదూ మరి! మనల్ని గుర్తించి, ఆదరిస్తే అది మనకెంత గొప్ప! అందుకే ఒద్దిగ్గా అతని జేబులోకెళ్లి కూర్చున్నా.

మెల్లగా నడుచుకుంటూ ఇంటికి వెళ్లగానే ముద్దులు మూటగట్టే ఓ బాబు ఎదురయ్యాడు. "నాన్నా! నీకో గుడ్ న్యూస్" అన్నాడు. తండ్రితో పాటూ నేనూ చెవులు నిక్కించా. పసిపిల్లలు ఏం మాట్లాడినా వినాలనిపిస్తుంది సుమా! "నాకు ఫస్ట్ ర్యాంక్ వచ్చింది" అన్నాడు వాడు మెరిసే కళ్లతో. "నిజమా, బంగారూ! వెరీ గుడ్!" ప్రశంసించాడు తండ్రి. నేనూ మౌనంగానే మెచ్చుకున్నా.

"గుడ్ అంటే సరిపోతుందా? వాడికేమైనా బహుమతివ్వరూ!" అంటూ తీసుకొచ్చిన కాఫీ అతనికిస్తూ అందో ముద్దరాలు. బహుశా ఆయన ఇల్లాలేమో! ఎంతైనా ఆడవాళ్లకున్నపాటి ఆలోచన మగవాళ్లకు ఉండదు. ఆమె అలా అనడంతో ఆగలేదు. భర్త జేబులో చొరవగా చేయిపెట్టి "అరె, కొత్తనోటు. నాన్నా, ఈ వంద నోటు నీ కిడ్డీ బ్యాంకులో వేసుకో" అంటూ కొడుకు చేతికిచ్చింది. ఎగిరి గంతేస్తున్న ఆ చిన్నారిని చూసి నా మనసూ పులకరించింది. కష్టపడి సాధించినదానికి ఫలితంగా బహుమతిగా వెళ్లడంకన్నా సంతోషించాల్సిన విషయమేముంటుంది?

పసివాడు నా వంక కాసేపు ఆప్యాయంగా చూశాడు. అంతటితో చాలదన్నట్లు ఓ ముద్దిచ్చాడు. ఆ అనుభూతి నాకూ బాగుంది. అమ్మతనాన్ని మించిన ఆనందం ఏముంది? పసిపిల్లల ఆనందం... అదో మకరందం సుమీ! తరువాత బాబు మెల్లగా నన్ను తన కిడ్డీ బ్యాంకులో జారవిడిచాడు. చుట్టూ చీకటి ఉన్నా నా మనసునిండా అదో తృప్తీ... ఆనందమూను! ఆ బుజ్జిగాడు అప్పుడప్పుడూ నన్ను బైటికి తీసి ఓసారి తడిమేవాడు. వాడితో అలా మధ్యమధ్యలో ఆడుకోవడం, బైటిగాలి పీల్చుకోవడం నాకూ బాగానే ఉంది. ఇదంతా చూస్తూ ఆ తల్లిదండ్రులూ మురుసుకునేవాళ్లు.

ఓ మధ్యరాత్రిలో ఏదో సవ్వడి. బాబు తండ్రి నన్ను బైటికి తీస్తున్నాడు. భార్య కళ్లలో చెమ్మ. "ఎంతో ముచ్చటపడ్డాడు. వాడికి తెలిస్తే..." అంటున్న భార్యను ఆపుతూ, "ఊరుకో సత్యా! నెలాఖరు కదా! అవసరం పడింది. జీతం రాగానే మళ్లీ వేసేస్తా. వాడితో నువ్వేం అనకు" సర్దిచెబుతున్నాడు భర్త. గాఢంగా నిట్టూర్చింది సత్య. ఇలా ఎన్నిసార్లు జరగలేదు? సత్యతోపాటూ, ఓ నిట్టూర్పు విడవడం తప్ప నేనేం చేయగలను. మధ్య తరగతి బతుకులు ఇంతేగా!

మర్నాడు పొద్దున్నే ఓ దుకాణంలోకొచ్చి పడ్డాను. అంతా ఓరకమైన వాసన. యజమానికి నేనంటే పెద్ద లెక్క ఉన్నట్లే కనిపించలేదు. నాలాంటివాళ్లక్కడ చాలామందాయే! సాయంత్రానికి అన్నీ కట్టకట్టి ఎవరికో ఇచ్చి పంపించాడు. ఇంటి ఇల్లాలు వాటిని బీరువాలో భద్రపరిచింది.

అది మొదలు కొన్నేళ్లు నేనలా చీకటికొట్లో బందీ అయిపోయాను. నేను పుట్టింది ఎందుకు? ఎన్నో అవసరాలు తీర్చడానికేగా! మరి నన్నిక్కడ ఎందుకు బందీచేశారు? నా బతుకు సార్థకమయ్యేది ఎన్నడు? ఇక నా జీవితం ఇంతేనా అనుకుంటున్న సమయంలో నన్ను బైటికి తీశాడు నా యజమాని. గుండెలనిండా గాలి పీల్చుకున్నాను. వెలుగులో నా రూపం చూసుకుందును కదా! ఆ ఫెళఫెళలు, తళతళలూ లేవు. కొద్దిగా నీరుకావి రంగు వచ్చింది... అనుకుంటుండగానే తీసుకెళ్లి కట్టగా దేవుడి ముందు పెట్టాడు. ఓహో! పూజ చేస్తున్నారు. అంటే పదిమందికీ దానం చేస్తారేమో! పోన్లే బైటపడుతున్నాను అనుకుంటూ ఆ ధూపదీప నైవేద్యాల వాసనలన్నీ ఓపిగ్గా పీల్చాను. అగరొత్తుల పొడి పడుతున్నా, పసుపు, కుంకుమలు అంటుకున్నా, నీళ్ల చుక్కలు పడి ఓ పక్క తడిసినా ఓర్చుకున్నాను. కానీ, ఈ మహానుభావునికేమీ దానాలిచ్చే బుద్ధి ఉన్నట్లు లేదు. పూజంతా పూర్తయ్యాక చక్కా తీసుకెళ్లి బీరువాలో భద్రపరిచాడు. జీవితంలో ఎన్నడూ లేనంత విరక్తి పుట్టింది!

మరికొన్ని రోజులకే బీరువా తెరిచారు. అతని భార్యామణి ఓ రెండు కట్టలు తీసి తన హ్యాండ్‌బ్యాగ్‌లో వేసుకుంది. హమ్మయ్య ఈనాటికి కదా నాకు మోక్షం లభించిందని సంబరపడిపోయాను. మెత్తగా కారులో ప్రయాణిస్తూ చల్లగా ఉన్న ఓ పెద్ద భవంతిలోకి వెళ్లాం. బ్యాగు ట్రాన్స్‌పరెంటుది లెండి! కనుక నాకంతా కనపడుతోంది. అదో బట్టల దుకాణం. ఆవిడ, స్నేహితురాళ్లు కలిసి ఏవేవో చీరెలు సెలెక్ట్ చేసుకున్నారు. విలాసంగా మమ్మల్ని తీసి బిల్లు కట్టేశారు. ఈ యజమాని మోటుగా ఉన్నాడు. కొంపదీసి నా పరిస్థితి పెనం మీది నుండి పొయ్యిలో పడ్డట్లవుతుందా ఏంటీ ఖర్మ..!

రాత్రికి డబ్బు తీసుకుని అతను కారులో వెళ్తూండగా అడ్డంగా ఓ యువతి చేయిచాపి ఆపింది. ఎముకను చూసి కుక్క ఆగిపోయినట్లే ఆగిపోయాడాయన. ఆమెను ఎక్కించుకుని అడ్రస్ అడుగుతూ మరెక్కడికో తీసుకుపోయాడు. ప్యాంటు జేబులోంచి అన్నీ నాకంట పడుతూనే ఉన్నాయి. అంతా పూర్తయ్యాక నన్ను బైటికి లాగి ఆమె ముఖాన కొట్టాడు. "తక్కువిచ్చావేంటీ! ఇంకా ఇస్తానన్నావు" అరుస్తున్నా పట్టించుకోకుండా వెళ్లిపోయాడు.

ఆ క్షణంలో నాకు చచ్చిపోవాలన్నంత విరక్తి కలిగింది. లేకుంటే, ఇంత బతుకూ బతికి ఇప్పుడు దీని చేతిలోకి పోవాల్సి వచ్చిందేనన్న బాధ నన్ను దహించివేస్తోంది. కానీ, ఆ స్త్రీ కళ్లలో మాత్రం నేనెన్నడూ చూడనంత వెలుగు కనిపించింది. నేనెంత దూరంగా జరుగుదామన్నా ముఖానికి దగ్గరగా తీసుకుని పెదాలకు హత్తుకుంది. నాలో విచిత్రమైన కంపనం. ఇంతలో ఆమె కన్నీరు వెచ్చగా నన్ను తడిపింది. ఆ తడి నాకెన్నో కథలు చెప్పకనే చెప్పింది. ఆ కన్నీటి వెనుక ఆర్తి ఉందో లేదో తెలీని నా గుండెను తడిమింది. ఒక వెలయాలు, ఒక వేశ్య గుండెలో ఇంత వ్యథ. తల్లీ! ఏడవకు! నా అవసరం నీకెంతగానో ఉందని నాకు అర్థమవుతూనే ఉంది. ఎంత కష్టమొస్తే నీ రక్తమాంసాలను అమ్ముకునే దుస్థితికి దిగజారావో. నన్ను ఉపయోగించుకుని నీ అవసరం తీర్చుకో.

అలా కన్నీటితోనే ఆమె వెనుక గదిలోకి వెళ్లింది. అక్కడ చిక్కి శల్యమైన ఐదేళ్ల బాబు. పాలబుగ్గల బుజ్జిగాడికి, వీడికీ ఎంత తారతమ్యం? ఆ యువతి వాడ్ని ఒక్క ఉదుటను కౌగిలించుకుని భోరున ఏడ్చింది. "కన్నా! నా కడుపున పుట్టిన పాపానికి నువ్వీ వ్యాధి బారిన పడ్డావు. ఈ రోగం మనకు అంటకట్టిన మీ నాన్న అర్థాంతరంగా తనువు చాలించాడు. ఎంత కష్టపడైనా నిన్ను కాపాడుకుంటానురా... ఏమైనా చేస్తానురా..." పలవరిస్తోంది. తల్లిని కప్పలా

కరుచుకుపోయిన బాబు, "అమ్మా! ఏడవకు! నా జ్వరం తగ్గిపోతుందిలే" అంటూ ఓదార్చాడు. వాడి చిట్టి చేతుల్ని తీసుకుని ఒకటే ముద్దులు పెట్టుకున్న ఆ తల్లి, "బంగారూ! కాసేపలాగే పడుకో. ఇప్పుడే వెళ్లి నీకు మందులు, పళ్లు తీసుకొస్తా" అంటూ దుప్పటి కప్పింది. "మన దగ్గర డబ్బులు లేవు కదమ్మా!" అన్నాడు వాడు అమాయకంగా. "లేదు కన్నా! నాకో ఉద్యోగం దొరికింది. వాళ్లు నాకు డబ్బులిచ్చారు. ఇవిగో చూడు..." అంటూ నన్ను చూపింది. వాడి కళ్లు అంత నీరసంలోనూ కాంతులు విరజిమ్మాయి. "పది నిముషాల్లో వచ్చేస్తా" అంటున్న తల్లితో, "అమ్మా! చాక్లెట్ తీసుకురావూ" అన్నాడు వాడు గారంగా. "తప్పకుండా నాన్నా! మరి నువ్వు మంచిగా రెస్టు తీసుకోవాలి. సరేనా" అంటూ వాడి నుదుటన ముద్దు పెట్టుకుందామె. చూస్తున్న నా హృదయం తల్లడిల్లిపోయింది. ఇలాంటివారికే నా అవసరం వుంది. వీరికి ఉపయోగపడితే కదా, నా జన్మ సార్థకమయ్యేది అనుకుంటూ తన్మయత్వంతో కళ్లు మూసుకున్నాను.

ఆమె వేగంగా మందుల దుకాణం వైపుకు అడుగులేస్తోంది. ఇంకో నాలుగడుగులు వేస్తే చాలు మందుల దుకాణం వచ్చేసేదే. ఇంతలోనే ఓ కుదుపు. అయ్యో! రెక్క పట్టుకుని ఆమెనెవరో గుంజుతున్నారు! "ఏంటే! ఈ సమయంలో ఎటూ ప్రయాణం. బేరాలేమీ దొరకలేదా? అయినా నేనున్నాగా, రా!" అంటూ అతను మీదికి లాక్కున్నాడు. "వదలండి సార్!" ఆమె దండం పెడుతోంది. అంతలో వాడి కళ్లు ఏం జరుగుతుందా అని జాకెట్లోంచి ఆత్రంగా తొంగిచూస్తున్న నామీద పడనే పడ్డాయి. "అమ్మ దొం...జా! అప్పుడే గిరాకీ అయిపోయిందన్నమాట! ఏమాత్రం సంపాదించావేంటీ" అంటూనే నన్ను లాక్కున్నాడు. "బాబూ! మీకు దండం పెడతాను. ఆ డబ్బు నాకెంతో అవసరం. మా బాబుకు ఒంట్లో బాలేదు" అంటున్న ఆమెను విదిలించుకుని వెళ్లిపోతున్నాడు. వాడి మొరటు చేతుల్లో చిక్కుకున్న నేను ఆమెవంక దీనంగా చూడటం తప్ప మరేమీ చేయలేకపోయాను. ఒక్కపెట్టున తలను చేతులతో కొట్టుకుంటూ రోదిస్తున్న ఆమె క్రమేణా కనుమరుగైపోయింది. ఆ పసివాడు ఏమవుతాడో! ఆ తల్లి మనసు ఎలా తట్టుకుంటుందో ఆలోచిస్తుంటేనే నా గుండెల్లో బాధ సుడులు తిరుగుతోంది. పరిస్థితిని మార్చొచ్చని, వాడికి ఉపయోగపడొచ్చనీ కదా అనుకున్నాను. ఇంతలో ఎంత ఘోరం. వీడిని తగలెయ్య!

అడ్డమైన తిరుగుళ్లూ తిరిగి వాడు ఏ అర్ధరాత్రికో కొంపకు చేరాడు. యూనిఫాం హ్యాంగర్‌కు తగిలించి గుర్రుపెట్టి నిద్రపోయాడు. మర్నాడు ఆయనగారి కొడుకు కామోసు వచ్చి, "నాన్నా పాకెట్‌మనీ తీసుకుంటున్నా.." అంటూనే జేబులో చేయిపెట్టి నాతోపాటూ మరికొన్ని నోట్లు లాగి తన పర్సులో దాచుకున్నాడు. తరువాత ప్రియురాలితో కలిసి ఖరీదైన రెస్టారెంటుకెళ్లి కడుపారా లాగించి బిల్లు చెల్లించాడు.

ఇక హోటల్ యజమాని దగ్గర కొన్నాళు ఉంటానేమో అనుకున్న నా ఊహలు ఓ రూపానికి రాకముందే కట్టలుగా కట్టిన మమ్మల్ని ఒక సూట్‌కేసులో జాగ్రత్తగా సర్దాడాయన. తిన్నగా తీసుకెళ్లి, 'నమస్కారం మంత్రిగారూ' అంటూ పెట్టెను ఎంతో భక్తిగా సమర్పించాడు. ఆ మర్నాడు మంత్రిగారు తన వంధిమాగధులను పిలిచి, 'వీటిని పంచండి... ఓట్లు బాగా పడాలి' అంటూ భద్రంగా మమ్మల్ని అప్పగించాడు. వాళ్లు చుట్టుపక్కలున్న గుడిసెల దగ్గరికి వెళ్లి అందర్నీ పిలిచారు. పాపం, వారంతా ఒకేసారి గుమిగూడారు. వచ్చిన వారికి వచ్చినట్లు మంత్రిగారి సేవకులు డబ్బు పంచుతున్నారు. అదంతా చూస్తుంటే నాకు భలే చిత్రంగా అనిపించింది. ఇప్పటిదాకా నాకోసం శ్రమించినవారిని, కష్టపడి రక్తమాంసాలు, చెమట ధారపోసిన వారినే చూశాను. డబ్బుకోసం తపించేవారిని, ఆత్రపడేవారిని చూశాను. కానీ ఇలా పేదలకోసం ఆలోచించి డబ్బు పంచుతున్నారంటే... అనుకుంటుండగానే ఓట్లకోసమే కదా నాయకులు నోట్లు వెదజల్లేది అని గుర్తొచ్చింది.

పోన్లే ఏదో ఒక రూపేణా పైకం పేదలకు చేరింది. మేం వారి ఇంటిఖర్చులకు ఉపయోగపడితే అంతకన్నా కావాల్సిందేముంది అనుకుంటూ తృప్తిపడ్డాను. కానీ అలా జరగలేదు. నన్ను అందుకున్న వాడు నన్ను చూసి మురిశాడు. 'పదరా' అంటూ స్నేహితుడ్ని పిలిచాడు. వాడి కాళ్లు తిన్నగా మందు దుకాణం దగ్గరికి పోయాయి. అయ్యో! చేతికి అందిన పైకాన్ని వీడెందుకిలా వృథా చేస్తున్నాడు. అసలు వీడికి నావంక చూస్తే నేను కాక మందు బుడ్డీ కనిపించిందన్నమాట! వీళ్లిలా ఉండబట్టేగా 'వి'నాయకులు వీరిని వారధిగా చేసుకుని కోట్లు బొక్కుతున్నారు. ఎన్ననుకుని ఏం లాభం, క్షణాల్లో నేను చేతులు మారాను. కడుపులో ఒకటే వికారం. ఈ వాసనే అదోలా ఉంది. ముక్కుమూసుకుని అలాగే ఓపికపట్టాను. చుట్టూ ఉన్న అద్దాల్లో నా రూపం చూసుకున్నాను. ఇప్పుడు నేను పూర్తిగా మారిపోయాను. జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు చూసిన వృద్ధురాలిలా నా శరీరమంతా ముడతలు. ఆ వేశ్య బతుకులా నలిగిపోయిన నా యవ్వనం. ఇక ముందు ముందు ఏమేం చూడనున్నానో!

మళ్లీ నేను, నాబోటివాళ్లమంతా కలిసి ఓ కట్టగా మారాం. ఇంతలో ఎవరో ముగ్గురొచ్చారు. దుకాణం యజమాని వారికి ఒంగి ఒంగి దండాలు పెట్టాడు. "సార్! మీ ఎమౌంట్ రెడీ. ఎప్పటికప్పుడు మీ ఎకౌంట్ సెటిల్ చేస్తుంటాను. నా మీద కేసులు పెట్టకండి సార్! రేయ్! ఆ స్పెషల్ సరుకు అయ్యగారి కార్లో పెట్టించండ్రా" అంటూ కొన్ని కట్టలు తీసి వాళ్ల చేతులకిచ్చాడు. వాటిని ముగ్గురూ ఆనందంగా పంచుకున్నారు.

నేనున్న కట్ట ఒకాయన బీరువాలోకి చేరింది. నా జీవితం మళ్లీ చీకటైపోయింది. అలా యేళ్లు పూళ్లూ గడిచిపోయాయి. నన్ను బైటికి తీసిన పాపాన పోలేదు. ఇదేంటీ! వీళ్లు మనుషులు కాదా! నన్ను సృష్టించుకుని, నా చుట్టూ తిరుగుతున్న జీవులు కాదా! నన్ను వాడుకోరేం! నేను చక్రభ్రమణం చేస్తేనే కదా పనులన్నీ జరుగుతాయి. నేనిలా ఒకచోటే పాతుకుపోతే ఎలా? నా అవసరం ఈ ప్రపంచంలో మరెందరికి ఉందో? నాలో ఒకటే మథనం. అబ్బే, వీరికేమీ పట్టడం లేదు. పైగా అప్పుడప్పుడు బీరువా తెరుస్తారు. మరికాసిన్న కట్టలు తోస్తారు. తప్ప, ఒక్క నోటన్నా బైటికి తియ్యరు.

రోజులు గడిచిపోతున్నాయి. నాకేదో వ్యాధి సంక్రమించింది. నాలో పటుత్వం తగ్గిపోతోంది. తట్టుకునే ఓపిక సన్నగిల్లిపోతోంది. రానురాను నాలో కొంత భాగాన్ని కోల్పోతున్నట్లుగా భరించరాని నొప్పి.

ఓరోజు బీరువా తెరిచారు. ఇది మామూలేగా! మళ్లీ మరిన్ని కట్టలను మాతో కలపడానికేగా అనుకున్న నేను నిర్లిప్తంగా ఉన్నాను. విచిత్రంగా మమ్మల్ని బైటికి లాగుతున్నారు. యేళ్ల తరువాత వెలుగు చూడటంవల్లనో, వృద్ధాప్యంవల్లనో కళ్లు చికిలించుకున్నాను. ఈ కాంతి సూర్యకాంతి కాదు, కెమెరా లైట్ల కాంతి. ఆ మిరుమిట్లకు నా కళ్లు బైర్లుకమ్మాయి. మెల్లగా చుట్టూ చూశాను. ఇల్లంతా ఒకటే హడావిడి. అధికారులు, రకరకాల ఛానళ్లవాళ్లూ మమ్మల్ని చుట్టుముట్టారు. ఓ పక్క యాంకరమ్మ, "మరో అవినీతి సర్పం గుట్టు రట్టు. బీరువాలో బైటపడ్డ 'కట్టల' పాములు..." అంటూ వయ్యారంగా చెప్పుకుపోతోంది. మమ్మల్ని తీసి వరుసలుగా పరుస్తున్నారు. కానీ వాళ్లు చేతుల్లోకి తీసుకుంటుండగానే నాలో రకరకాల మార్పులు. తాళలేని బాధ. అయ్యో! ఇదేంటీ, ఈ అన్యాయమేంటీ? వద్దు, వద్దు ఆగండి, మెల్లగా... అయ్యో! అక్కడ పట్టుకోకండి.

నాకు ఒక్కసారిగా నా తొలినాటి రూపం గుర్తొచ్చింది. బుజ్జిగాడు, వాడి తల్లిదండ్రులు, దుకాణందారు, వేశ్య, ఆమె కొడుకు, పోలీసు.... ఇలా అంతా కళ్లముందు మెదిలారు. హు! అయిపోయింది... ఇక మాట్లాడలేను. అయ్యో! నా రూపమేంటి క్రమంగా కనుమరుగైపోతోంది. నాకు చావు లేదనుకున్నాను. కానీ, నేనేంటిలా ఉన్నట్లుండి పొడిగా మా..రి..పో..తు..న్నా..ను.?! ★



వినోదం... విజ్ఞానం

మే నెల అంటేనే... పిల్లలందరికి చాలా ఆనందంగా, సంతోషంగా ఉంటుంది. కానీ తల్లిదండ్రులకు మాత్రం ఇబ్బందే అని చెప్పాలి. కారణం పాఠశాలలకు వేసవి సెలవులివ్వడమే. అదీ నెలన్నర రోజులు. వేసవి సెలవులు, వాటి ప్రాముఖ్యత, ఈ సెలవుల్లో పిల్లలను ఎలా పెంచాలి? పిల్లలను పూర్తిగా ఆటపాటలకే వదిలేయాలా? లేక వేసవి శిక్షణా తరగతులకు పంపాలా? వేసవి సెలవుల ప్రభావం పిల్లలు, వారి ప్రవర్తనపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? ఈ సెలవులను పిల్లలు ఎలా ఉపయోగించుకోవాలి? ఇలాంటి ప్రశ్నలు ప్రతి తల్లిదండ్రులను వేధిస్తుంటాయి. వీటిని మానసిక విశ్లేషణ కోణంలో ఆలోచిస్తే ఎలా ఉంటుందో చూద్దామా!

వేసవి సెలవులనగానే పిల్లల్లో మొదట వారికి గుర్తువచ్చేది ఉదయాన్నే లేటుగా లేవడం. ఎక్కువ శాతం తల్లిదండ్రులు సెలవుల్లో పిల్లలు ఉదయం 10 గంటల దాకా నిద్రపోయినా చూసీ చూడనట్లు వదిలేస్తుంటారు. దీనిద్వారా పిల్లలకు బద్ధకాన్ని నేర్పుతుంటారు. సెలవుల్లో ప్రత్యేకంగా కాకుండా స్కూలుకు వెళ్లే రోజుల్లో ఎలా చూస్తారో ఇప్పుడు అదే విధంగా వారిని నిద్రలేపాలి.

ప్రణాళికాబద్ధంగా...

గడియారంతో పరుగిడే ఈ యాంత్రిక యుగంలో మానవ సంబంధాలు పూర్తిగా తగ్గిపోతున్నాయని చెప్పాలి. కుటుంబ సభ్యుల మధ్య అన్యోన్యతలు, సంబంధ బాంధవ్యాలు కనుమరుగవుతున్నాయి. కారణం సమయం దొరక్కపోవడం అనడం కన్నా సమయాన్ని ప్రణాళికాబద్ధంగా ఉపయోగించకపోవడమనాలి. ఎవరి పనుల్లో వారు పూర్తిగా లీనమవుతున్నారు. ఈ క్రమంలో తల్లిదండ్రులకు, పిల్లల మధ్య దూరం పెరుగుతోంది. పిల్లలు కూడా ఈ విధమైన జీవనశైలికి అలవాటుపడున్నారు. తల్లిదండ్రులకు, పిల్లలకు వారానికి ఒకసారి దొరికే సెలవు రోజును కూడా సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

పిల్లలకోసం కూసింత సమయం

సాధారణంగా తల్లిదండ్రులు తమ పిల్లలతో ఎక్కువ సమయం గడపడం సాధ్యమవడం లేదు. కానీ పిల్లలకు వారితో కలిసి ఉండే సమయం కూడా తక్కువే. ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు పిల్లలు కుటుంబంలోని పెద్దవాళ్లను నమూనాగా తీసుకోవడం, నడవడికకు సంబంధించి వారి ప్రమాణాలు అనుసరించేవారు. కానీ ఈ యాంత్రిక యుగంలో అది అసాధ్యంగానే ఉంది!

అమ్మమ్మ...నానమ్మ ఒడిలో...

కుటుంబ సభ్యుల మధ్య అనుబంధం మరింత బలపడడానికి వేసవి సెలవులు చక్కగా ఉపయోగపడతాయి. సెలవుల్లో చిన్న పిల్లలను తమ సొంత ఊళ్లలోని తల్లిదండ్రుల వద్దకు పంపడం వల్ల ఇది సాధ్యమవుతుంది. కుటుంబ ఆచార, వ్యవహారాలు, అలవాట్లు, సాంఘిక, నైతిక విలువలు పెంపొందేందుకు ఆస్కారముంది. విలువలు నేర్చుకునేందుకు, భాష పెంపొందించుకునేందుకు ఈ సెలవులు పిల్లలకు ఉపయోగపడతాయి. తమ వయసు పిల్లలతో ఆడుకోవడం వల్ల వారిలో మానసిక పరిపక్వత పెరుగుతుంది. ఎదుటివారి ద్వారా వచ్చే ఇబ్బందులకు ఎలాంటి పరిష్కారాలు వెతకవచ్చో తెలుసుకోవచ్చు. పిల్లలంతా ఒకచోట కలిసి ఉంటే మొదట వారి స్కూలు, తరగతిలో జరిగిన సంఘటనలు, వారి టీచర్ల గురించి, స్నేహితులు గురించి, తమాషా విశేషాల గురించి సంభాషిస్తారు. దీని ద్వారా మానసిక పరిపక్వత సాధించే అవకాశముందని మానసిక నిపుణుల అభిప్రాయం.

డాక్టర్ డి. నిరంజన్
మానసిక వైద్యనిపుణులు,
చిన్న పిల్లల మానసిక వ్యాధుల విభాగం,
నీలోఫర్ ఆసుపత్రి, హైదరాబాద్.
ఫోన్: 9885112328



బలహీనతల భరతం పట్టే సమ్మర్ క్యాంప్!

వేసవి సెలవుల్లో నగరాలు, పట్టణాల్లో కొన్ని పాఠశాలలు, సంస్థలు వేసవి శిక్షణా శిబిరాలు (సమ్మర్ క్యాంప్స్) నిర్వహిస్తుంటాయి. వీటి ద్వారా చాలా ఉపయోగాలున్నాయి. కొంత మంది విద్యార్థులకు కొన్ని బలహీనతలుంటాయి. ఉదాహరణకు ఎదుటివారితో సర్దుబాటు చేసుకోలేకపోవడం, తోటి విద్యార్థులతో తక్కువ సంబంధాలుండటం, తమను తాము తక్కువగా అంచనా వేసుకోవడం



వంటివి. వేసవి శిబిరాల వల్ల పిల్లలు తమలోని బలహీనతలను గుర్తించి, వాటి నుండి బయటపడే అవకాశముంది. ఇది వారి వికాసానికి దోహదపడుతుంది. ఈ శిబిరాల వల్ల పిల్లలు ఇతర స్కూళ్ల వారితో కలవడం, పరిచయాలు పెంచుకోవడం వంటివి సాధారణంగా జరిగిపోతుంటాయి. ఆ సమయంలో తమ తోటివారు ఏవిధంగా ప్రవర్తిస్తున్నారు, ఏవిధంగా ఆటలాడుతున్నారనేది గమనించి వాటిని నేర్చుకుంటారు.

పిల్లల్లోని కుతూహలం, అన్వేషణా శక్తిని తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలి. దీనికి తగ్గ వాతావరణాన్ని ఇంట్లో కల్పించాలి. బొమ్మలేయడం ఇష్టంగా ఉన్న వారికి కలర్ పెన్సిళ్లు, బ్రష్షులు, డ్రాయింగ్ షీట్లు, పెన్సిళ్లు ఇవ్వాలి. కొంత మంది పిల్లలు టీవీల్లో పాటలు చూస్తూ స్టెప్పులు వేస్తూ అనుకరిస్తుంటారు. అలాంటి వారికి వేసవిలో డాన్స్ క్లాసులకు పంపడం ద్వారా వారిలో కళానైపుణ్యం బయటపడుతుంది. కొంత మందికి గొంతు శ్రావ్యంగా ఉంటుంది. పాటలు పాడితే వినసొంపుగా ఉంటుంది. ఇటువంటి వారిని సంగీతం శిబిరాలకు పంపితే వారు సెలవులు ఎంజాయ్ చేస్తారు.

సాంకేతిక పరిజ్ఞానం

వేసవి సెలవుల్లో పిల్లలను శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం పెంచే కేంద్రాలకు (బిర్లా ప్లానిటోరియం, మ్యూజియం) తీసుకెళ్లడం ద్వారా చదివిన విషయాలను ప్రత్యక్షంగా చూడటంతో వాటిని మరచిపోలేరు. ఈ అంశాలపట్ల కుతూహలం, ఇంకా నేర్చుకోవాలన్న తపన కలుగుతుంది. పిలలు ఏఏ విషయాలపై ఎక్కువగా ఆసక్తి చూపుతారో వాటిపై సమాచారం సేకరించడానికి తల్లిదండ్రులు సహకరించాలి. ఉదాహరణకు కొంత మందికి కొన్ని రకాల జంతువులపై ప్రత్యేక ఆసక్తి ఉండొచ్చు. డైనోసార్ ఎలా పుట్టింది? ఎన్ని సంవత్సరాలు జీవించింది? వాటి పరిణామ క్రమం, ఎన్ని రకాల డైనోసార్లు ఉన్నాయి? మొదలైన సమచారం సేకరించడానికి పిల్లలను గ్రంథాలయాలకు, జియోలాజికల్ పార్కులకు తీసుకెళ్లాలి. ఇంటర్నెట్‌లో ఈ సమాచారాన్ని ఎలా సేకరించాలో నేర్పించాలి.

వ్యక్తిత్వ వికాసం

కొన్ని విద్యాసంస్థలు, ధార్మిక సంస్థలు వేసవిలో పిల్లలకు వ్యక్తిత్వాన్ని పెంపొందించడానికి వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తుంటాయి. వీటి ద్వారా పిల్లలు తమ వ్యక్తిత్వం గురించి తెలుసుకోవటమే కాక, వారిలో విశ్లేషణా సామర్థ్యం పెరుగుతుంది. ఎందుకంటే బాల్యంలో జరిగిన సంఘటనల ప్రభావం పెద్దయ్యాక వుంటుందని ప్రఖ్యాత మానసిక తత్వవేత్త సిగ్మండ్ ఫ్రాయిడ్ అంటారు. చిన్నతనంలో కలిగిన చెడు అనుభవాలు వ్యక్తిత్వంపై చెరగని ముద్ర వేస్తాయంటారు. వ్యక్తిత్వ వికాసం ద్వారా సాంఘిక, నైతిక విషయాలు, మంచి అలవాట్లు అలవర్చుకోవడం, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడం, ఆత్మన్యూనతా భావాన్ని పోగొట్టుకోవడం గురించి తెలుసుకోవచ్చు. పిల్లలు తమను తాము అంచనా వేసుకుని ఒక స్వంత నిర్ణయానికి ఎలా రావడమనేది నేర్చుకోవచ్చు. కుటుంబానికి దూరమవుతూ, స్కూల్లో సమ వయస్కులకు దగ్గర అయినపుడు, పిల్లల్లో వారి విలువలు ముఖ్యపాత్ర వహిస్తాయి. ఇటువంటి సమయాల్లో వ్యక్తిత్వ వికాసం క్లాసులు చాలా ఉపయోగపడతాయి.



తల్లిదండ్రులకు, యుక్తవయస్సులోని తమ పిల్లలకు మధ్య దూరం పెరుగుతోంది. ఇటువంటివి తగ్గించడానికి వ్యక్తిత్వ వికాస తరగతులు చాలా దోహదం చేస్తాయి.

యోగా, ధ్యానం ద్వారా కూడా పిల్లల్లో మానసిక పరిపక్వతను పెంపొందించవచ్చని మానసిక విశ్లేషకుల అభిప్రాయం. ఇటువంటి వాటి ద్వారా మానసిక ఆరోగ్యం పెంపొందించి పిల్లల్లో ఏకాగ్రతను పెంపొందించడానికి దోహదపడతాయి.

తల్లిదండ్రులు వేసవి సెలవుల్లో వారి పిల్లలకు పూర్తి స్వేచ్ఛను ఇస్తూ వారి ఖాళీ సమయాన్ని ఉపయోగపడే విధంగా వారి దినచర్యను ప్రణాళికా బద్ధంగా తయారు చేయాలి.

కొన్ని కేంద్రీయ పాఠశాలలు, సిబిఎస్‌సి, ఐసిఎస్ సిలబస్ బోధించే పాఠశాలలు తమ విద్యార్థులకు పాఠ్యాంశంలో భాగంగా కొన్ని ప్రాజెక్టులు కేటాయిస్తున్నారు. దీనిద్వారా విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను గుర్తించే వీలుంది. సృజనాత్మకత ఉన్నవారి ఏదైనా సమస్య ఎదురైతే వివిధ రకాలైన పరిష్కార మార్గాలు వెతికే సామర్థ్యం ఉంటుంది. సమస్యను పరిష్కరించుకునే దశలో వివిధ రకాలైన అడ్డంకులు ఎదురైతే వాటిని ఎలా పరిష్కరించుకోవాలో, ఎటువంటి పరిష్కార మార్గం ఉత్తమమైనదో నిర్ణయించుకోగల శక్తి వారికి వస్తుంది. ★

ముక్కుసూటి పక్షి

ఈ వారం మనం చెప్పుకోబోయే పక్షిపేరు తెల్ల కంకణం. ఇది పెద్ద సైజు కోడి పెట్టంత ఉంటుంది. దాని మెడ, తల నల్లగా ఉంటాయి. ఈ భాగాలపై ఈకలుండవు. బోడిగా ఉంటాయి. దీని ముక్కు పొడుగ్గా, లావుగా, నల్లగా, కిందికి వంగి ఉంటుంది. గూళ్లు కట్టుకుని, గుడ్లు పెట్టే సమయంలో భుజం... రెక్కలపై ఈకలు బూడిద రంగులో ఉంటాయి. మెడకింద పొడుగాటి అందమైన కుచ్చు వస్తుంది. ఇది చెరువు ఒడ్డున ఎక్కువగా కనిపిస్తుంది. అంతేకాదు! గుంపులోనే తిరుగుతుంది. ఈ గుంపు ఇంగ్లీషు అక్షరం 'వి' (V) ఆకారంలో ఎగురుతుంది. ఇది నత్తలు, పీతలు, కప్పలు, క్రిములు, కీటకాలను ఆహారంగా తీసుకుంటుంది. ఇంకా చేపలను కూడా ఇష్టంగా తింటుంది. ఈ పక్షి ఎప్పుడూ ముక్కు సూటిగా ఎగురుతుంది. ఇది ఎగిరేటప్పుడు మెడను ముందుకు సాచి, కాళ్లు, తోకను వెనక్కి పెడుతుంది. ఈ పక్షికి స్వరపేటిక లేదు. గుడ్లు పెట్టే కాలంలో విచిత్రమైన ధ్వనులు చేస్తుంది. ఇది నీటి ఎ్కల ఉన్న చెట్టుమీదే గూడు కట్టుకుంటుంది. ఇది తడవకి 2 నుండి నాలుగు గుడ్లను పెడుతుంది. ఇవి లేతాకుపచ్చ కలిసిన తెలుపురంగులో ఉంటాయి.



విహంగం

కళాపోసన మరి!

ఏది ఎక్కడ?

ఫ్రెండ్స్... ఇక్కడ మూడు బెలూన్లు ఉన్నాయి. పక్కనే వాటికి సంబంధించిన విడి భాగాలు ఉన్నాయి. మీరేం చేయాలంటే ఆ భాగాల్ని... ఎలా అమరిస్తే కరెక్టు ఆకారం వస్తుందో చూసి పెట్టేసెయ్యండి.



ఎన్ని వున్నాయ్!

బుజ్జాయిలూ... ఈ బొమ్మలో మీకు ఏం కనిపిస్తున్నాయి? గుర్రాలు కదూ! సరిగ్గా చూసి ఈ బొమ్మలో ఎన్ని గుర్రాలు ఉన్నాయో చెప్పండి.

జవాబు: ౧౧

హా...హా

దాచిపెట్టుకోవాలిగా...

హరి : ఏనుగుకు తొండం ఎందుకుంటుందో తెలుసా?

సురేష్ : ఏనుగు ఏమైనా దాచిపెట్టుకోడానికి జేబులుండవుకదా! అందుకే తొండం ఉంది.

పెన్సిల్‌తో...

రాజేష్ : హలో డాక్టర్! మా అబ్బాయి నా పెన్ను మింగేశాడు. ఇప్పుడేంచేయాలి?

డాక్టర్ : నేను తర్వాత తీసిస్తాలే గానీ ముందు మీరు పెన్సిల్‌తో రాసుకోండి.

మొదటి సారి

రోగి : డాక్టర్. నాకు చాలా భయంగా వుంది. ఎందుకంటే నేను ఆపరేషన్ చేయించుకోవడం ఇదే మొదటిసారి.

డాక్టర్ : నేను నీ భయాన్ని అర్థం చేసుకోగలను. ఎందుకంటే నేను మొదటి ఆపరేషన్ ఇప్పుడే చేస్తున్నాను. నాక్కూడా అలాగే వుంది.



కవలలు ఏవి?

హాయ్.. ఇక్కడ ఆరు పిల్లులున్నాయి! అవన్నీ చూడ్డానికి ఒకేలా ఉన్నాయి. కానీ వాటిలో రెండు మాత్రమే కవలలు. అవేంటో చెప్పుకోండి చూద్దాం.

జవాబు: 2,6

ఎప్పుడు? ఎలా?

రాహుల్‌కి ఏడుగురు స్నేహితులున్నారు. మొదటి స్నేహితుడు మొదటి రోజు, రెండవ స్నేహితుడు రెండవరోజు, మూడవ స్నేహితుడు మూడవరోజు... ఇలా ఏడుగురు ఏడు రోజులు ఒక్కొక్కరుగా వచ్చి రాహుల్‌ని కలుసుకునేవారు. అయితే అందరు స్నేహితులు కలుసుకునే అవకాశం ఉంటుందా? అది ఎప్పుడు? ఎన్ని రోజులకు?

ఎన్ని ఆటలు?

ముగ్గురు మిత్రులు ఒక ఆటను ఆడుతున్నారు. ఈ ఆటను ఆడాలంటే తప్పనిసరిగా ఇద్దరుండాలి. వాళ్ల ముగ్గురు కలిసి మూడు ఆటలు ఆడారు. అయితే ఒక్కొక్కరు ఎన్ని ఆటలు ఆడినట్లు?



ఎప్పుడు? ఎలా? : 420 రోజులకు ఒకసారి అందరు స్నేహితులు కలుసుకుంటారు. ఎలా అంటే 1 నుండి 7 వరకు అన్ని అంకెలూ శేషం లేకుండా భాగించగలిగే అతి చిన్న సంఖ్య 420. ఈ నెంబరు ఎంతో ప్రత్యేకత గలది. **ఎన్ని ఆటలు :** ఒక్కో వ్యక్తి రెండు ఆటలు ఆడినట్లు. ఎలా అంటే ముగ్గుర్ని ఎ,బి,సి అనుకుంటే ఎ-బి,సితో, బి-సి,ఎతో, సి-ఎ,బితో కలిసి ఆడాలి. అంటే ఒక్కొక్కరు ఇద్దరితో ఆడితే రెండు ఆటలు ఆడినట్లే కదా.

రంగులు నింపేద్దాం...!

చిన్నారులూ... ఇక్కడ చక్కని మిక్కీమౌస్ ఉంది చూశారుగా. దీనికి ఏరంగులు వేస్తే మరింత బావుంటుందో చూసి చకచకా వేసేయండి.

మాటల కోట - 52

రూపకల్పన : కర్లపాలెం

1		2		■	3	4		
■	■		■	5	■		■	■
6	7	■	8			■	9	10
11		12	■		■	13		
■	■	14		■	15		■	■
16	17		■	18	■	19	20	21
22		■	23			■	24	
■	■	25	■		■	26	■	■
27				■	28			

అడ్డం :

1. యవ్వనము (4)
3. విషం (4)
6. చాగంటి సోమయాజులుగారి పొట్టిపేరు (2)
8. సంపూర్ణంగా... (3)
9. కోడిగుడ్డులోని ద్రవం (2)
11. మాలిన్యం (3)
13. మన్నన (3)
14. సందడిలోని కంచె (2)
15. తిరగబడిన రోగి (2)
16. ఆనాడు (3)
19. విరక్తి తిరగబడింది (3)
22. రుక్మిణి ముద్దుగా (2)
23. వదిలించుకోలేనిది (3)
24. కొండ (2)
27. పల్నాటి యుద్ధంలో నలగామరాజు రాజధాని (4)
28. పతాకము (4)

నిలువు :

2. 'వడివేలు'లోని వేగం (2)
4. కాంతి (2)
5. పర్వదినము (3)
6. చామకూర వెంకటకవిలో దుంపకూర (2)
7. వాలికాదు. పడిపోవడం (2)
9. సోదిగా చెప్పడం (2)
10. నాలుకకు ఇది లేదు (2)
12. 'ఆనందవనం'లో ఉద్యానవనం (3)
13. ప్రతివారికి ఇదే మహాభాగ్యం (3)
16. 'ఆరున్నొక్కరాగంలో ఒక రాగాన్ని నొక్కేయండి (2)
17. దిశ (2)
18. గోడ వికృతి .... ప్రకృతి (3)
20. రాయలసీమ సంకటి (2)
21. వైఖరిలో శత్రువు (2)
25. మజా డ్రింక్ (2)
26. సీతకే కాదు దీనికీ కష్టాలే (2)

మాటలకోట - 51 జవాబు

1 కు	2 బే	రు	3 డు	■	■	4 గు	లా	బి
■	ర	■	క	■	■	ణ	■	■
5 మే	ము	■	6 ఒ	ప్పం	7 ద	ము	■	8 జ
9 న	లు	10 పు	■	■	ళ	■	11 కా	య
రి	■	12 ని	13 క	ర	ము	■	14 శి	ల
కం	■	15 స్త్రీ	ల	■	■	16 ం	■	లి
■	17 హ	■	18 త	19 నూ	20 జ	■	21 క	త
22 కూ	జా	■	■	23 రు	ల		డ	■
24 న	రే	ష్	■	■	25 గ	ణ	ప	తి

నక్క అప్పు

నల్లమల అడవుల్లో ఓ నక్క ఉంది. అది మహా సోమరి. కష్టపడి పనిచేసి సంపాదించడం దానికి అస్సలు నచ్చదు. దర్జాగా కూర్చుని కులాసాగా జీవితం గడపాలని కోరిక. 'కష్టపడకుండా జీవించాలంటే ఎలా?' అని బాగా ఆలోచించి అప్పులు చేయడం నేర్చుకుంది.

అప్పుచేసి పప్పుకూడు తింటూ కాలం గడుపుతోంది. అప్పు చేయడమే తప్ప చేసిన అప్పు తీర్చడానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు. దాంతో అడవిలోని జంతువులన్నీ నక్కకు అప్పు ఇవ్వకూడదని నిర్ణయించుకున్నాయి.

ఒక రోజు నక్కకు బిర్యానీ తినాలని బుద్ధి పుట్టింది. అడవిలో ఎలుగుబంటి మామ హోటల్లో బిర్యానీ చాలా బాగుంటుంది. అయితే డబ్బులు ఇవ్వందే ఎలుగుమామ పిడికెడు బిర్యానీ కూడా ఇవ్వడని నక్కకు తెలుసు. దాంతో ఎవర్ని అప్పు అడుగుదామా అనుకుంటూ బయలుదేరింది.

దారిలో దానికి అడవిపిల్లి కనిపించింది.

నక్క నవ్వుతూ "పిల్లి బావా, పిల్లి బావా! ఎప్పుడొచ్చావు? ఊళ్లో అందరూ కులాసానా?" అని అడిగింది.

అడవిపిల్లి నక్కను అదోలా చూస్తూ "ఎప్పుడూ లేనిది ఈ రోజు మా బాగోగుల గురించి అడుగుతున్నావేం?" అంది.

"భలేవాడివే! నువ్వేమైనా కొత్తవాడివా? అది సరేబావా! పదిరూపాయలు అప్పు ఇవ్వవా? రేపు తిరిగి ఇచ్చేస్తాను" అంది.

"ఇంతకు ముందు కూడా ఇలాగే చెప్పి పది రూపాయలు తీసుకున్నావు. ఆరు నెలలైనా ఇంకా ఇవ్వలేదు. ముందు ఆ అప్పు తీర్చు" అంది అడవి పిల్లి గట్టిగా.

నక్క గతుక్కుమంది. "ఇప్పుడే తెస్తాను" అంటూ అక్కడినుండి జారుకుంది.

"ఇంకెవర్ని అడుగుదాం?!" అని ముందుకు వెళ్తుంటే ఉడుత ఎదురుపడింది.

నక్క వెంటనే దాన్ని ఆపి "ఉడుతా, ఉడుతా! ఓ పది రూపాయలు అప్పివ్వవా?" అంది.

"నువ్వు మోసకారివని మా అమ్మ చెప్పింది. నీ మాటలు నమ్మొద్దని మా అన్న చెప్పాడు. నేను నీకు అప్పు ఇవ్వనే ఇవ్వను" అంటూ చెట్లకొమ్మల్లోకి మాయమైంది.

నక్క మళ్లీ అక్కడ్నుండి కదిలింది. దారిలో దానికి కుందేలమ్మ కనిపించింది.

నక్క వెంటనే "కుందేలమ్మా, కుందేలమ్మా! ఓ పది ఉంటే ఇచ్చుకో. రేపు తిరిగి ఇచ్చేస్తాను" అంది.

"చాల్చాల్లే! నీ మాటలు నమ్మి డబ్బులు ఇస్తే వాటిని బావిలో వేసినట్టే. నువ్వు జిత్తులమారివి. ఇంకెవర్నైనా అడుక్కో" అంటూ పొదల్లో దూరింది.

ఆ రోజు నక్క దారిలో కనిపించిన అన్ని జంతువుల్నీ అప్పడిగింది. అయితే ఒక్కటి కూడా ఇవ్వలేదు. దానికి చాలా దిగులేసింది. విచారంగా కూర్చుని ఆలోచించసాగింది. నక్కను ఆ స్థితిలో చూసిన భూదేవికి జాలేసింది. "ఏమిటి తమ్ముడూ, ఎందుకలా విచారిస్తున్నావు? ఏంటి నీ సమస్య?" అని అడిగింది.

నక్క మనసులో ఓ ఆలోచన మెదిలింది. అది దీనంగా మొహం పెట్టి "ఏం చెప్పమంటావు అక్కా? కష్టాల్లో ఉన్న నన్ను చూసి తోటి జంతువులు కొంచెం కూడా జాలి చూపట్లేదు. పది రూపాయలు అవసరమై అడిగితే ఎవ్వరూ ఇవ్వడంలేదు. అక్కా, నీవైనా ఇవ్వవా? రేపు తిరిగి ఇచ్చేస్తాను" అంది.

భూదేవికి నక్క మీద చాలా జాలేసింది. అయ్యో పాపం అనుకుంది. పది రూపాయలు ఇస్తూ "రేపు తప్పకుండా ఇవ్వాలి" అంది.

"అలాగలాగే" అంటూ నక్క పది రూపాయలు తీసుకుని ఆనందంగా ఎలుగుమామ హోటల్ వైపు పరుగుతీసింది.

మరుసటి రోజు భూదేవి అప్పు తీర్చలేదు నక్క. మరో రెండు రోజులు చూసింది. నక్క జాడలేదు. వారం దాటింది. పక్షం రోజులు గడిచాయి. అయినా నక్క తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వడం లేదు. ఆమెకి విసుగొచ్చింది.

ఇక లాభం లేదనుకున్న భూదేవి వెళ్తున్న నక్కని దారిలో ఆపి, "నా అప్పు ఎప్పుడు తీరుస్తావు?" అని అడిగింది.

నక్క భూదేవికి సమాధానం చెప్పకుండా ముందుకు పరుగెత్తి ఓ చెట్టు కింద ఆగింది. "నా అప్పు ఎప్పుడు తీరుస్తావు?" అంది భూదేవి మళ్లీ.

నక్క మళ్లీ పరుగందుకుంది. అయితే నక్క ఎటు వెళ్లినా అక్కడ నక్కను ఆపి అప్పు తీర్చమంది భూదేవి. నక్క మళ్లీ పరుగుతీసింది. అలా... పరుగెడుతూ పరుగెడుతూ ఓ ముళ్ల కంచె మీద పడింది. దాంతో ఓ ముల్లు దాని కంట్లో గుచ్చుకుని కన్ను పోయింది.

మళ్లీ భూదేవి ఎదురుగా వచ్చి "నా అప్పు ఎప్పుడు తీరుస్తావు?" అని అడిగింది.

నక్కకు ఓ ఆలోచన వచ్చింది. "ఏ అప్పు?" అని అడిగింది అమాయకంగా మొహం పెట్టి.

"నా దగ్గర తీసుకున్న పదిరూపాయలు" అంది భూదేవి కాస్త కోపంగా.

"అయ్యో, మీరు పొరబడినట్టున్నారు. మీరు ఎవరికి అప్పు ఇచ్చారో ఏమో?" అంది నక్క

"నీకే ఇచ్చాను" అంది భూదేవి.

"మీరు అప్పు ఇచ్చిన నక్కకు ఎన్ని కళ్లు?" అడిగింది నక్క

"రెండు" అంది భూదేవి అనుమానంగా నక్కను చూస్తూ.

"నాకు వున్నది ఒక కన్నే. నేను గుడ్డిదాన్ని. మీరు అప్పు ఇచ్చింది నాకు కాదు. ఎవరికిచ్చారో వెళ్లి వాళ్లను అడగండి" అని నక్క అక్కడ్నుండి తాపీగా నడుచుకుంటూ వెళ్లి పోయింది.

"కన్ను పోయినా ఈ నక్కకు బుద్ధి రాలేదే. అందుకేనేమో పుట్టుకతో వచ్చిన బుద్ధులు పుడకల్తో గానీ పోవంటారు పెద్దలు" అనుకుని భూదేవి మిన్నకుండిపోయింది.



- రంగనాథ రామచంద్రరావు

రెక్కల కళ

అందానికి చిరునామా సీతాకోక చిలుక! అంతగా ఆకట్టుకునే రంగురంగుల రెక్కలతో కళాఖండాలు సృజిస్తే... చూడ్డానికి రెండు కళ్లూ చాలవు. ఎంత చూసినా తనివి తీరదు.

అదేంటో కొందరికి దేన్ని చూసినా కళాత్మకంగా కనిపిస్తుంది. వారు చేత్తో స్పృశిస్తే చాలు! అందమైన కళాఖండం తయారైపోతుంది. మీ ముందున్న చిత్రరాజాలన్నీ అలాంటివే. అన్నీ రంగురంగుల సీతాకోకచిలుకల రెక్కలే.

ఆ... కంగారుపడకండి. సదరు ఆర్టిస్టు మనసు అంత క్రూరమైంది కాదు. చనిపోయిన సీతాకోకచిలుకల రెక్కలను మాత్రమే ఇందుకోసం వాడారు. పార్కుల్లో, అడవుల్లో నేలమీద రాలిన సీతాకోకచిలుకల రెక్కలను సేకరించి చేసినవే ఈ కళాకృతులు. అన్నీ ఆఫ్రికా ప్రపంచానికి అద్దం పట్టేవే. అక్కడి ప్రజలు, జంతువులు, పక్షులు, ఆచారవ్యవహారాలు, సంస్కృతులను చెప్పేవే.